

కిరండోల్ రైళ్లకు అదనపు విస్టాడోమ్, ఏసీ కోచ్

విశాఖపట్నం, సెప్టెంబరు 12: పర్యాటకుల రద్దీని దృష్టిలో ఉంచుకుని విశాఖ, కిరండోల్ మధ్య నడిచే రైళ్లకు అదనంగా ఒక విస్టా డోమ్ కోచ్, థర్డ్ ఏసీ ఎకానమీ కోచ్‌లను జత చేస్తున్నామని సీనియర్ డీసీఎం సందీప్ తెలిపారు. ఈ నెల 14,21,28 (ప్రతి శనివారం) విశాఖ నుంచి కిరండోల్ 08551 నంబరు గల రైలుకు... ఈ నెల 15, 22, 29 తేదీల్లో కిరండోల్ నుంచి విశాఖ వచ్చే 08552 నంబరు గల రైలుకు విస్టా డోమ్ కోచ్ అందుబాటులో ఉంటుందన్నారు. ఈ నెల 15, 22, 29న (ప్రతి ఆదివారం) విశాఖ నుంచి కిరండోల్, 16, 23, 30న కిరండోల్ నుంచి విశాఖ వచ్చే రైలుకు థర్డ్ ఏసీ కోచ్‌ను జత చేస్తున్నామన్నారు.

భక్తి ముసుగులో వ్యాపారం

వినాయక విగ్రహాల దర్శనానికి రూ.20, రూ.50, రూ.100 టికెట్లు

- ప్రాంగణాల్లో స్టాళ్లు ఏర్పాటు చేసి వేల రూపాయలకు అద్దెకు ఇచ్చుకుంటున్న నిర్వాహకులు
- వాహన పార్కింగ్ ఫీజు కూడా వసూలు
- ఎంవీపీ కాలనీ, సింధియా, గాజువాక... అంతా ఇదే తీరు





ఎంవీపీ కాలనీలోని అప్పుఘర్ వద్ద ఏర్పాటుచేసిన అయోధ్య రామయ్య వినాయక విగ్రహం దర్శనానికి టికెట్ పెట్టిన నిర్వాహకులు. (ఇన్‌సెట్‌లో) బయట ఏర్పాటుచేసిన స్టాళ్లు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

భక్తి ముసుగులో కొందరు అందినకాడికి దోచుకుంటున్నారు. భారీ వినాయకుడిని ప్రతిష్ఠించామని ప్రచారం చేసుకొని దానిని సొమ్ము చేసుకుంటున్నారు. విశాఖలో ఈ తరహా దోపిడీ కరోనాకు ముందే మొదలైంది. గాజువాక, ఎంవీపీ కాలనీల్లో ఖాళీగా ఉండే మైదానాలను అద్దెకు తీసుకొని, రకరకాల వ్యాపారాల కోసం స్టాళ్లు అద్దెకు ఇచ్చి తిరునాళ్లలా నిర్వహించేవారు. కేవలం 21 రోజులకే లక్షలాది రూపాయల లాభం, పేరు రావడంతో కొనసాగించుకుంటూ వస్తున్నారు. ఈ వినాయక చవితిని తీసుకుంటే ఎంవీపీ కాలనీలో గాదెరాజు ప్యాలెస్ సమీపాన అయోధ్య సెట్ వేసి, రాముడి విగ్రహాన్ని చాక్లెట్‌తో తయారుచేశారు. వినాయకుడిని కూడా నీలం రంగులో రూపొందించి ఆకర్షణీయంగా పెట్టారు. ప్రాంగణం అంతా వ్యాపారమయం చేశారు. దేవుడిని దర్శించుకోవడానికి రూ.20, రూ.50, రూ.100 టికెట్లు పెట్టారు. చెప్పుల స్టాండ్ కూడా అద్దెకు ఇచ్చి రూ.5 వసూలు చేస్తున్నారు. కొబ్బరికాయ రూ.30, ప్రసాదం రూ.15కి విక్రయిస్తున్నారు. వాహనం పార్క్ చేసినందుకు కూడా డబ్బులు తీసుకున్నారు. ఇక స్టాల్ ఒక్కొక్కదానికి రూ.50 వేలు తీసుకున్నారు. జెయింట్ వీల్ వంటి వినోదాలు కూడా ఏర్పాటు చేశారు. ఇక్కడ వినాయకుడిని తయారు చేయడానికి ఒడిశా నుంచి వచ్చిన శిల్పిని కొట్టారని నిర్వాహకులపై ఎంవీపీ పోలీస్ స్టేషన్‌లో కేసు కూడా నమోదైంది.

ఇక గాజువాకలో వినాయక ఉత్సవాల నిర్వహణ పక్కా వ్యాపారంలాగే సాగుతోంది. ఈసారి 117 అడుగుల ఎత్తైన విగ్రహం అని ప్రచారం ... మిగతా 6వ పేజీలో



విశాఖ స్టేషన్‌కు ఎన్‌ఎస్‌జీ-1 గుర్తింపు

ప్రతిపాదించిన కేంద్ర రైల్వే బోర్డు

- ఆమోదం లభిస్తే మరిన్ని ఆధునిక వసతులు, సౌకర్యాలు, రైళ్లు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

విశాఖపట్నం రైల్వే స్టేషన్‌ను నాన్ సబర్బన్ గ్రూపు (ఎన్‌ఎస్‌జీ)-1లో చేర్చాలని కేంద్ర రైల్వే బోర్డు తాజాగా ప్రతిపాదించింది. ప్రస్తుతం విశాఖపట్నం స్టేషన్ ఎన్‌ఎస్‌జీ-2లో ఉంది. ఏడాదికి రూ.500 కోట్లకు పైగా ఆదాయం, రెండు కోట్ల మంది ప్రయాణిస్తే ఆ స్టేషన్‌ను ఎన్‌ఎస్‌జీ-1లో చేరుస్తారు. విశాఖ రైల్వేస్టేషన్ 2023-24లో గణనీయమైన ప్రగతిని సాధించింది. స్టేషన్ ఆదాయం రూ.5,641.66 కోట్లు కాగా అందులో రిజర్వ్‌డ్ ప్రయాణికుల నుంచే రూ.678.81 కోట్ల ఆదాయం సమకూరింది. ఈ తరహా ఆదాయం చాలా కాలంగా వస్తున్నా ప్రయాణికుల సంఖ్య రెండు కోట్లకు చేరలేదనే కారణంతో ఇప్పటివరకూ దీనిని ఎన్‌ఎస్‌జీ-2లో కొనసాగిస్తున్నారు. భువనేశ్వర్ కేంద్రంగా పనిచేస్తున్న తూర్పు కోస్తా జోన్‌లో ఎక్కువ ఆదాయం సాధించే స్టేషన్లు 20 వరకు ఉండగా వాటన్నింటిలో విశాఖపట్నమే మొదటి స్థానంలో నిలుస్తోంది. ఈ ఆదాయం ఇంకా పెరిగే అవకాశం ఉండడంతో రైల్వే బోర్డు ఎన్‌ఎస్‌జీ-1లో చేర్చాలని ప్రతిపాదించింది.

ఏమిటి ప్రయోజనం?

ఎన్‌ఎస్‌జీ-2 నుంచి 1కి మారడం వల్ల ఏమిటి ప్రయోజనం అనే ప్రశ్న సాధారణంగా వినిపిస్తుంది. అలా మారిస్తే ఆ స్థాయికి తగినట్టుగా స్టేషన్‌ను అభివృద్ధి చేస్తారు. అధునాతన వసతులు కల్పిస్తారు. ప్రయాణికులకు ఇంకా మెరుగైన సదుపాయాలు అందుతాయి. వాణిజ్య పరంగా అభివృద్ధి చేస్తారు. డిమాండ్‌కు తగిన రైళ్లను నడుపుతారు. రైల్వే బోర్డు ప్రతిపాదనపై అధికార వర్గాలు హర్షం వ్యక్తంచేస్తున్నాయి.

సీపీ x డీఐజీ

సీఐల బదిలీ ప్రక్రియపై భేదాభిప్రాయాలు

- నగర పోలీస్ కమిషనర్ పీఈబీ ఆమోదం తీసుకోలేదని వాదన
- నగరంలో పోస్టింగ్ వచ్చినా చేరని కొంతమంది ఇన్‌స్పెక్టర్లు
- ఆయా జిల్లాల్లో రిలీవ్ చేయకపోవడమే కారణం
- డీఐజీ అనుమతించలేదని ప్రచారం



సీపీ శంఖబ్రత బాగ్చి

గోపీనాథ్‌జెట్టి విశాఖ రేంజ్ డీఐజీ

విశాఖపట్నం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి):

నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చికి, విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్‌జెట్టికి మధ్య కోల్డ్‌వార్ నడుస్తోందనే చర్చ పోలీస్ వర్గాల్లో సాగుతోంది. ఇరువురు అధికారుల మధ్య ఏర్పడిన విభేదాలు ఇటీవల నగర పరిధిలో సీపీ చేపట్టిన సీఐల బదిలీల అనంతరం తారస్థాయికి చేరినట్టు ప్రచారం జరుగుతోంది.

ఇటీవల సీపీ శంఖబ్రత బాగ్చి మూడు విడతల్లో 52 మంది సీఐలను బదిలీ చేయడం/పోస్టింగ్ ఇవ్వడం చేశారు. ఆ సమయంలో సీపీ నిబంధనలకు విరుద్ధంగా రేంజ్ పరిధిలోని సీఐలకు నగరంలో పోస్టింగ్‌లు ఇచ్చారని డీఐజీ అభ్యంతరం వ్యక్తంచేసినట్టు తెలిసింది. సాధారణంగా విశాఖ రేంజ్ పరిధిలో ఎస్ఐ ఉద్యోగాల అపాయింట్‌మెంట్ అథారిటీగా డీఐజీ వ్యవహరిస్తారు. ఎస్ఐలను జిల్లాలకు కేటాయించిన తర్వాత వారికి ఎక్కడ పోస్టింగ్ ఇవ్వాలనేది సంబంధిత జిల్లా ఎస్పీ విచక్షణపై ఆధారపడి ఉంటుంది. అదే మాదిరిగా సీఐల బదిలీ నగర పోలీస్ కమిషనరేట్ మినహా విశాఖ రేంజ్ పరిధిలో డీఐజీ విచక్షణపై ఆధారపడి ఉంటుంది. ఒకవేళ రేంజ్ పరిధిలో పనిచేస్తున్న సీఐలను నగర పోలీస్ కమిషనరేట్‌కు తీసుకోవాలని సీపీ భావిస్తే పోలీస్ ఎస్టాబ్లిష్‌మెంట్ బోర్డు (పీఈబీ) ఆమోదం తప్పనిసరి. నగరానికి ఎవరెవరిని తీసుకోవాలనుకుంటున్నారనే జాబితాను సీపీ..రేంజ్ డీఐజీకి పంపిస్తే ఆయన వారిని రేంజ్ నుంచి సిటీ వీఆర్‌కు బదిలీ చేస్తారు. సిటీ వీఆర్‌కు వచ్చిన తర్వాత ఎక్కడ ఎవరికి పోస్టింగ్ ఇవ్వాలనే దానిపై సీపీకి మాత్రమే విచక్షణాధికారం ఉంటుంది. అలాగే సిటీ నుంచి రేంజ్‌కు బదిలీ చేయాలనుకుంటే సీపీ వారిని వీఆర్‌కు మాత్రమే సరండర్ చేయాలి. అక్కడ నుంచి డీఐజీ వారి సేవలను ఎక్కడెక్కడ వాడుకోవాలనేది నిర్ణయించుకుంటారు. ఇదిలావుంటే నగర పరిధిలో జరిగిన గత మూడు దశల సీఐల బదిలీలు/పోస్టింగ్‌ల ప్రక్రియలో మొదటి రెండు దశలకు సంబంధించి సీపీ సీఐలను బదిలీ చేసినప్పుడు పీఈబీ ఆమోదం తీసుకోలేదని పోలీస్ అధికారులు కొందరు చెబుతున్నారు. రేంజ్ పరిధిలో పనిచేస్తున్న వారిలో నిజాయితీపరులు, సమర్థులుగా గుర్తింపు ఉన్న సీఐలను సీపీ నగరానికి తీసుకున్నారు. ఈ క్రమంలో కొందరు ప్రజా ప్రతినిధులను సిఫారసులను సైతం సీపీ పక్కనపెట్టారంటూ రాజకీయ వర్గాల్లో దుమారం రేగింది. నగరంలో పోలీసింగ్‌ను బలోపేతం చేయడమే తన లక్ష్యమని, మరో ఆలోచనకు తావు ఉండకూడదనే పారదర్శకంగా బదిలీలు చేపట్టానంటూ సీపీ కొందరు అధికారుల వద్ద అభిప్రాయపడినట్టు తెలిసింది. ఇదిలావుండగా రేంజ్‌లో పనిచేస్తూ సిటీకి బదిలీ అయిన సీఐలు కొందరు ఇప్పటికీ తమ కొత్త పోస్టింగ్‌లలో చేరలేదు. ఇప్పుడు పనిచేస్తున్న స్థానం నుంచి వారిని డీఐజీ రిలీవ్ చేయడానికి నిరాకరించడమే దీనికి కారణమంటూ ప్రచారం జరుగుతోంది. సీఐల బదిలీల అంశం ఇప్పటికే డీజీపీ ద్వారకా తిరుమలరావు దృష్టికి చేరినట్టు పోలీస్ అధికారులు చెబుతున్నారు. ఏదిఏమైనా సీపీ, డీఐజీల మధ్య తలెత్తిన విభేదాలు తమకు సమస్యగా పరిణమించాయంటూ నగర పరిధిలో పోస్టింగ్‌లు దక్కించుకున్న సీఐలు వాపోతున్నారు.

రైళ్లు ఫుల్

మొదలైన దసరా తాకిడి

- రేపటి నుంచి వచ్చే నెల 22 వరకూ బెంగళూరు వెళ్లే ప్రధాన రైళ్లలో బెర్తులు రిజర్వ్
- హౌరా మార్గంలోనూ డిమాండ్
- అక్టోబరు ఒకటి నుంచి 22 వరకు బెర్త్ లభించని పరిస్థితి
- సికింద్రాబాద్, చెన్నై రైళ్లలో మాత్రం లభ్యం



విశాఖపట్నం, సెప్టెంబరు 12:

రైళ్లకు దసరా రద్దీ ప్రారంభమైంది. విశాఖ మీదుగా హౌరా, బెంగళూరు వెళ్లే పలు రైళ్లలో ఈ నెల 14 నుంచి అక్టోబరు 22వ తేదీ వరకూ బెర్తులు రిజర్వు అయిపోయాయి. అయితే దువ్వాడ మీదుగా హౌరాకు ప్రవేశపెట్టిన కొన్ని రైళ్లలో బెర్తులు లభించే పరిస్థితి ఉంది. ఈ ఏడాది బెంగళూరు చుట్టుపక్కల ప్రాంతాలకు వెళ్లే రైళ్లకు ఊహించని డిమాండ్ ఏర్పడింది. రోజూ నడిచే ప్రశాంతి, హౌరా-బెంగళూరు, భువనేశ్వర్-బెంగళూరు వంటి ఎక్స్‌ప్రెస్ రైళ్లలో బెర్తులు నిండిపోవడం గమనార్హం. సికింద్రాబాద్, చెన్నై, చుట్టుపక్కల ప్రాంతాలకు వెళ్లే రైళ్లకు సాధారణ రద్దీ కనిపిస్తోంది.

బెంగళూరు రైళ్లకు డిమాండ్

విశాఖ మీదుగా బెంగళూరు వెళ్లే రైళ్లకు డిమాండ్ ఎక్కువగా ఉంది. ఈ నెల 14 నుంచి అక్టోబరు 22 వరకు బెర్తులు నిండిపోయి నిరీక్షణ జాబితా ఏర్పడింది. ముఖ్యంగా భువనేశ్వర్-బెంగళూరు ప్రశాంతి ఎక్స్‌ప్రెస్ (18463), హౌరా-యశ్వంతపూర్ (12863)లలో అన్ని శ్రేణుల బెర్తులు నిండిపోయాయి. జసితిహ్ జంక్షన్-ఎస్ఎంవీటీ బెంగళూరు (22306), భువనేశ్వర్-బెంగళూరు హంసఫర్ (22833), గువహటి-బెంగళూరు (12510), భగల్‌పూర్-బెంగళూరు (12254), హటియా-బెంగళూరు (18637), భువనేశ్వర్-బెంగళూరు హంసఫర్ (22833), హౌరా-మైసూరు (22817), న్యూ టిన్సుకియా-బెంగళూరు (22502), కామాఖ్య-బెంగళూరు (12552), పూరి-బెంగళూరు గరీబ్‌రథ్ (22883), హౌరా-బెంగళూరు దురంతో (12245), అగర్తల-బెంగళూరు హంసఫర్ (12504) ఎక్స్‌ప్రెస్ లల్లో కూడా బెర్తులు నిండిపోయాయి. విశాఖ నుంచి ప్రతి శుక్రవారం అందుబాటులో ఉండే టాటా-యశ్వంత్‌పూర్ ఎక్స్‌ప్రెస్‌లో (18111) కొన్ని బెర్తులు ఉన్నాయి.

హౌరా రైళ్లు ఫుల్

విశాఖ మీదుగా హౌరా వెళ్లే కోరమండల్ (12842), యశ్వంత్‌పూర్-హౌరా (12864), ఈస్ట్‌కోస్ట్ (18046), మెయిల్ (12840), ఫలక్‌నుమా (12704), బెంగళూరు-హౌరా దురంతో (12246) రైళతో పాటు, రెగ్యులర్ రైళ్లకు దసరా పండుగ నేపథ్యంలో అక్టోబరు ఒకటి నుంచి 22 వరకు నిరీక్షణ జాబితా కనిపిస్తోంది. ఇక షాలిమార్ (22641), మైసూరు-హౌరా (22818), వాస్కోడిగామ-షాలిమార్ (18048), గురుదేవ్ (12638), వివేక్ (22503), చెన్నై-సంత్రాగచ్చి (22808), పాండిచ్చేరి-హౌరా (12868), బెంగళూరు-గుహవటి (12509), చెన్నై సెంట్రల్-షాలిమార్ (22826), తిరుచిరాపల్లి-హౌరా (12664), కన్యాకుమారి-హౌరా (12666), తిరుపతి-హౌరా హంసఫర్ (29890), సికింద్రాబాద్-షాలిమార్ (22850), శ్రీసత్యసాయి ప్రశాంతి నిలయం-హౌరా (22832) వంటి పలు వారాంతపు రైళ్లకు డిమాండ్ ఏర్పడింది. దువ్వాడ మీదుగా నడిచే చెన్నై-సంత్రాగచ్చి ప్రత్యేక రైలు (06077), తిరునల్వేలి-హౌరా ప్రత్యేక రైలు (06087), కొచువేలి-షాలిమార్ (06081) తదితర ... మిగతా 6వ పేజీలో



జిల్లాను దేశంలో నంబర్‌వన్‌గా నిలపాలి

ఉపాధి, ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేయాలి

- కేంద్ర పథకాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలి
- జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ సమావేశంలో ఎంపీ మతుకుమిల్లి శ్రీభరత్
- అరకొర సమాచారంతో వస్తే ఎలాగంటూ అధికారులపై ఎమ్మెల్యేల అసంతృప్తి

జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ మతుకుమిల్లి శ్రీభరత్. చిత్రంలో కలెక్టర్ హరేంధిర ప్రసాద్, ఎమ్మెల్యేలు వెలగపూడి రామకృష్ణబాబు, పి.గణబాబు, పల్లా శ్రీనివాసరావు, పంచకర్ల రమేశ్‌బాబు, ఎమ్మెల్యే వేపాడ చిరంజీవిరావు, మేయర్ గొలగాని హరివెంకటకుమారి, విశాఖపట్నం పార్లమెంటరీ నియోజకవర్గ టీడీపీ అధ్యక్షుడు గండి బాబ్జీ ఉన్నారు. - వార్త 6లో

జీవీఎంసీలోకి 64 పంచాయతీలు

భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ప్రతిపాదన

- మూడు మండలాల ప్రజా ప్రతినిధుల అభిప్రాయం తీసుకున్నట్టు వెల్లడి
- పదేళ్లు పన్ను పెంచకుండా చూస్తాం
- మెయిన్ రోడ్డు, బీచ్ రోడ్డు, లక్ష్మీనరసింహస్వామి ఆలయం రోడ్డు విస్తరిస్తాం



విశాఖపట్నం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి):

అందరి ఆమోదంతో భీమిలి నియోజకవర్గంలోని 64 పంచాయతీలను జీవీఎంసీలో విలీనం చేయాలని ప్రతిపాదించామని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు చెప్పారు. ఎంవీపీ కాలనీలోని తన స్వగృహంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఆనందపురం, పద్మనాభం, భీమిలి రూరల్ మండలాలను జీవీఎంసీలో విలీనం చేయాలని పురపాలక శాఖ మంత్రి నారాయణకు లేఖ రాశామన్నారు. ఆనందపురం మండలంలో 26, పద్మనాభం మండలంలో 22, భీమిలి రూరల్ ... మిగతా 6వ పేజీలో

విశాఖతో ఏచూరికి ప్రత్యేక అనుబంధం

2015లో మొదటిసారి సీపీఎం ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైంది ఇక్కడే...

- చివరిసారిగా గత ఏడాది ఉక్కు ప్రైవేటీకరణ వ్యతిరేక సభకు హాజరు



ఆర్కే బీచ్‌లో జరిగిన సభలో ఏచూరి (ఫైల్)

విశాఖపట్నం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి):

అనారోగ్యంతో ఢిల్లీలో గురువారం కన్నుమూసిన సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరికి విశాఖ నగరంతో ప్రత్యేక అనుబంధం ఉంది. ఆయన 2015లో విశాఖపట్నంలో జరిగిన పార్టీ 21వ మహాసభలో మొదటిసారి జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు. విశాఖ కేంద్రంగా 2015 ఏప్రిల్ 14 నుంచి 19వ తేదీ వరకు జరిగిన సభల్లో ఆయనతోపాటు పార్టీ అగ్రనేతలంతా పాల్గొన్నారు. అప్పటి నుంచి వరుసగా 2018, 2022 సంవత్సరాల్లో జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికవుతూ వచ్చారు. అంతకు ముందు కూడా పలుమార్లు విశాఖ వచ్చారు. చివరగా గత ఏడాది విశాఖ ఉక్కు కర్మాగార ప్రైవేటీకరణకు వ్యతిరేకింగా నిర్వహించిన సభకు హాజరయ్యారు. నగరంలో పార్టీ నాయకులతో మంచి సంబంధాలు కలిగిన ఏచూరి ఉత్తరాది యాసతో కూడిన తెలుగులో అటు సభలు, ఇటు పత్రికా విలేకరుల సమావేశాలలో మాట్లాడేవారు.

ఏచూరికి నివాళి..

సీతారాం ఏచూరి మృతికి నగరంలో సీపీఎం నేతలు నివాళులర్పించారు. గురువారం సాయంత్రం జగదాంబ జంక్షన్‌లోని పార్టీ కార్యాలయంలో సంతాప సభ ఏర్పాటుచేసి ఆయన సేవలను కొనియాడారు. ఆయన మృతి వామపక్ష, లౌకిక, ప్రజాతంత్ర శక్తులకు తీరని లోటు అంటూ పేర్కొన్నారు. కార్యక్రమానికి పార్టీ నేతలు దండా సుబ్బారావు, ఎం.జగ్గునాయుడు, ఎ.అజశర్మ, ఎస్.సుధాకర్, గంగారావు, పద్మ, ఈశ్వరమ్మ, తదితరులు హాజరయ్యారు.

నేడు జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సమావేశం

- 280 అంశాలతో ఎజెండా
- మూడు గంటల్లో అన్ని అంశాలను ఎలా చర్చిస్తారని అనుమానాలు

- 6లో

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

అక్కయ్యపాలెం/ సీతమ్మధార, సెప్టెంబరు 12: నిర్వహణ పనుల నేపథ్యంలో శుక్రవారం నరసింహనగర్, రైతుబజార్, ఆకాష్ జూనియర్ కళాశాల ప్రాంతాల్లో ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు జోన్-1 ఈఈ బి.సింహాచలంనాయుడు తెలిపారు. సీతమ్మధార టీపీటీ కాలనీ, హిల్ వ్యూ పార్క్, రాకెట్ పార్క్, ఏఎస్ఆర్ నగర్, వాల్వో ఆఫీస్, సబ్బంహరి ఇంటి ప్రాంతం, క్షత్రియ కళ్యాణ మండపం, అల్లూరి సీతారామరాజు విగ్రహం పరిసర ప్రాంతాల్లో సరఫరా ఉండదన్నారు.

12 కిలోల గంజాయి పట్టివేత

విశాఖపట్నం, సెప్టెంబరు 12: గంజాయి రవాణా చేస్తున్న ఇద్దరిని రైల్వే పోలీసులు పట్టుకుని రూ.60,500 విలువ చేసే 12.1 కిలోల గంజాయి బ్యాగ్‌లను స్వాధీనం చేసుకున్నారు. ప్రత్యేక బృందం రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫామ్‌లపై తనిఖీలు చేస్తున్న సమయంలో కోరాపుట్‌కు చెందిన షాను ఖడా, మంగరాజ్ ఖడా నిందితులు గుర్తు తెలియని వ్యక్తులకు గంజాయి బ్యాగ్‌లను అందిస్తుండగా దాడిచేసి పట్టుకున్నామని పోలీసులు ప్రకటనలో తెలిపారు. నిందితులను అరెస్టు చేసి, కోర్టులో హాజరుపరిచామన్నారు.

జిల్లాను దేశంలో నంబర్‌వన్‌గా నిలపాలి

- ఉపాధి, ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేయాలి
- కేంద్ర పథకాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలి
- జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ సమావేశంలో ఎంపీ శ్రీభరత్

విశాఖపట్నం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): సమ్మిళిత అభివృద్ధి విధానాలను అవలంబిస్తూ ఉపాధి, ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేసి, జిల్లాను దేశంలోనే నంబర్‌వన్ స్థానంలో నిలబెట్టాలని ఎంపీ ఎం.శ్రీభరత్ పిలుపునిచ్చారు. ఇందుకోసం ప్రజా ప్రతినిధులు, అధికారులు విశేష కృషి చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన, ప్రయోజనాలపై విస్తృత ప్రచారం చేయాలని కోరారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో గురువారం నిర్వహించిన జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ (దిశా) సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ రాష్ట్రంలో అమలవుతున్న కేంద్ర ప్రాయోజిత పథకాలు, సమస్యలు, సవాళ్లపై అధికారులకు దిశా నిర్దేశం చేశారు. జిల్లాలో 29 శాఖల పరిధిలో ఉపాధి హామీ, ప్రధానమంత్రి ఆవాస్ యోజన, దీనదయాల్ అంత్యోదయ యోజన, ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన, డిజిటల్ ఇండియా, నేషనల్ లైవ్ స్టాక్, గోకుల్ మిషన్, ఖేలో ఇండియా, మాతృవందన యోజన, జాతీయ ఆరోగ్య మిషన్, జలజీవన్ మిషన్, పీఎం పోషణ, సంసద్ ఆదర్శ గ్రామ యోజన, పీఎం ఉజ్వల యోజన, పీఎం విశ్వకర్మ వంటి పథకాల అమలులో ఎదురవుతున్న ఇబ్బందులు, ప్రజలకు అందే ప్రయోజనాలపై సమీక్షించారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో వ్యవహరించి పథకాలు ప్రజలకు అందేలా చూడాలన్నారు. విద్యారంగానికి పెద్దపీట వేయాలని, ఉపాధి కల్పన కోసం యువతకు నైపుణ్యంలో కూడిన శిక్షణ ఇవ్వాలన్నారు. సోలార్ వినియోగం పెరిగేలా అవగాహన కల్పించాలన్నారు. మేహాద్రిగెడ్డ, గంభీరం రిజర్వాయర్ల నిర్వహణలో సమన్వయం లోపం తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని, పూడిక తొలగింపునకు ప్రణాళికలు రూపొందించాలన్నారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో 170 భవనాల నిర్మాణాలపై నివేదిక ఇవ్వాలని సూచించారు. కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర్ ప్రసాద్ జిల్లాలో కేంద్ర పథకాల అమలు తీరును వివరించారు. సమీక్షలో ఎమ్మెల్యేలు వెలగపూడి రామకృష్ణబాబు, పి.గణబాబు, పంచకర్ల రమేష్‌బాబు, పల్లా శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు పలు అంశాలపై ప్రశ్నలు వేశారు. మేయర్ గొలగాని హరివెంకటకుమారి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీ, డీఆర్వో కె.మోహన్‌కుమార్, జడ్పీ సీఈవో సత్యనారాయణ, పాల్గొన్నారు.

అరకొర సమాచారంతో వస్తే ఎలా?

సమావేశంలో ఎంపీతోపాటు ఎమ్మెల్యేలు లేవనెత్తిన అంశాలపై కొందరు అధికారులు నీళ్లు నమలడంతో వారిని మందలించారు. డ్వామా, డీఆర్‌డీఏ, వైద్య ఆరోగ్యశాఖ, హౌసింగ్ శాఖల అధికారుల తీరుపై ప్రజా ప్రతినిధులు అసంతృప్తి వ్యక్తంచేశారు. హుద్‌హుద్ బాధితులకు కొమ్మాదిలో నిర్మించిన ఇళ్లు పూర్తిచేయకపోవడం, ఇళ్ల కేటాయింపులో జాప్యంపై పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు అసంతృప్తి వ్యక్తంచేశారు. దాతల సాయంతో నిర్మించిన ఇళ్ల కేటాయింపుపై విచారణ చేయాలని తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు డిమాండ్ చేశారు. ఉపాధి హామీ అమలుపై పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు పలు సందేహాలు వ్యక్తంచేస్తూ సమావేశానికి ముందుగా ఎజెండా ఇవ్వాలన్నారు.

తాగునీటి కోసం రోడ్డెక్కిన మహిళలు

- పూర్ణామార్కెట్ పెరికివీధి వద్ద ఉద్రిక్తత



బిందెలతో నిరసన తెలుపుతున్న పెరికివీధి మహిళలు

జగదాంబ కూడలి, సెప్టెంబరు 12: ఖాళీ బిందెలతో మహిళలు రోడ్డెక్కి ఆందోళనకు దిగారు. మెయిన్ రోడ్డు గుండా వాహన రాకపోకలను మహిళలు అడ్డుకున్నారు. దీంతో పూర్ణామార్కెట్ పెరికివీధి రామాలయం వద్ద గురువారం ఉదయం ఉద్రిక్తత చోటుచేసుకుంది. కుళాయి ద్వారా నీటి సరఫరా నిలిపివేయడం పట్ల పెరికివీధి, స్ప్రింగ్ రోడ్డు ప్రాంతాల మహిళలు, స్థానిక నివాసీయులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండు మూడు గంటల పాటు మహిళలు ఆందోళనకు దిగడంతో వాహనరాకపోకలు పూర్తిగా స్తంభించిపోయాయి. అధికారులు, ప్రజా ప్రతినిధుల తీరును ఎండగట్టారు. ఆందోళన తీవ్రరూపం దాల్చడంతో నీటి సరఫరా విభాగం అధికారులు, కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు అక్కడకు వచ్చి మహిళలను శాంతపరిచే ప్రయత్నం చేశారు. శుక్రవారం ఈ రెండు ప్రాంతాలకు ఎక్కువ సమయం నీరు సరఫరా చేస్తామని హామీ ఇచ్చారు. రెండు, మూడు రోజులుగా పాతనగరంలోనూ ఇదే పరిస్థితి నెలకొనడం గమనార్హం, పాత నగరంలో నివాసీయులు పూర్తిగా కుళాయి నీటి మీద ఆధారపడడం, జీవీఎంసీ నీటి సరఫరాలో ఇబ్బందులు ఎదురవ్వడంతో మహిళలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. బిందెడు నీటి కోసం నిరీక్షించాల్సి వస్తోందని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఎయిర్‌పోర్ట్ ఎస్ఐగా సీహెచ్ ప్రసాద్

మర్రిపాలెం: ఎయిర్‌పోర్ట్ పోలీస్‌స్టేషన్ ఎస్ఐగా సీహెచ్ ప్రసాద్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. పార్వతీపురం మన్యం జిల్లా బత్తిలి నుంచి వచ్చారు. అసాంఘిక కార్యకలాపాలను అరికట్టేందుకు చర్యలు చేపడతామన్నారు.

వ్యభిచారం గుట్టు రట్టు

మర్రిపాలెం, సెప్టెంబరు 12: గ్రేటర్ పరిధి 52వ వార్డు కరాసలో ఇల్లు అద్దెకు తీసుకొని మూడు నెలలుగా వ్యభిచారం నిర్వహిస్తున్నట్టు అందిన సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్, విమానాశ్రయ పోలీసులు గురువారం దాడి చేశారు. ముగ్గురు నిర్వాహకులు, ఐదుగురు మహిళలు, ఇద్దరు విటులను పట్టుకున్నారు.

ఎస్సీల కులగణన చేపట్టాలి

సీతంపేట, సెప్టెంబరు 12: మాలలకు న్యాయం చేయాలని, ఎస్సీ కులగణన చేపట్టాలని డాక్టర్ అంబేడ్కర్ గ్లోబల్ మిషన్ అధ్యక్షుడు బయ్యే మల్లయ్య ప్రభుత్వాన్ని కోరారు. పౌరగ్రంథాలయంలో గురువారం మాట్లాడుతూ రివ్యూ పిటిషన్‌ను సుప్రీంకోర్టు ఆమోదించినందున తీర్పు వచ్చే వరకు వేచి చూడాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సువర్ణ రత్నం, దాసరి పుల్లారావు, ఎస్.మోహన్‌బాబు, బొత్స రామసూర్య ఎం.ఎ. రాజు, రేబాక మధు, కె.అనిల్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

నేవల్ క్విజ్ పోటీల్లో పల్లవి, కిరణ్మయి ప్రతిభ

విశాఖపట్నం, సెప్టెంబరు 12: ఎన్‌సీసీ క్యాడెట్లకు నేవల్ మెడికల్ యూనిట్ నిర్వహించిన క్విజ్ పోటీల్లో విశాఖ ప్రభుత్వ మహిళ కాలేజీ ఎన్‌సీసీ క్యాడెట్లు సీహెచ్ లక్ష్మీ పల్లవి, ఎస్.కిరణ్మయి కాంస్య పతకం దక్కించుకున్నారు. ఈ సందర్భంగా గురువారం ప్రభుత్వ మహిళ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.మంజుల వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సీసీ ఆఫీసర్ లెఫ్టినెంట్ డాక్టర్ కె.గీతాంజలి, పీడీ డాక్టర్ ఆర్.కిరణ్మయి, ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ డాక్టర్ బి.సంతోషి, అనూష పాల్గొన్నారు.

ముస్లింల సమస్యలు పరిష్కరిస్తా: ఎంపీ శ్రీభరత్



ఎంపీకు వినతి పత్రం అందిస్తున్న మసీద్ కమిటీ సభ్యులు

జగదాంబ కూడలి/మహారాణిపేట, సెప్టెంబరు 12: ముస్లింల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఈ వర్గ ప్రతినిధులకు ఎంపీ శ్రీభరత్ హామీ ఇచ్చారు. గురువారం జగదాంబ వద్ద మసీద్ కమిటీ సభ్యులు, ముస్లిం పెద్దలతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మసీద్ కమిటీ మహారాణిపేట అంగటి దిబ్బ వద్ద సుమారు 8 ఎకరాల తమ స్థలం దురాక్రమణకు గురయ్యిందని, అందుకు బదులుగా వేరొకచోట స్థలం ఇవ్వాలని మహారాణిపేటలోని మక్కా మసీదు అసోసియేషన్ అధ్యక్షుడు అబ్దుల్ మున్నీర్ కోరారు. నగర పరిధిలో వక్ఫ్‌భూముల అన్యాక్రాంతంతో ఇబ్బందులు పడుతున్నామని మరికొందరు ఎంపీ దృష్టికి తెచ్చారు. కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ బోర్డు చట్ట సవరణలకు తీసుకున్న నిర్ణయాల ప్రభావాన్ని పెద్దలు చర్చించారు. మధురవాడ వద్ద ముస్లింలకు స్థలం కేటాయింపు వ్యవహారం దీర్ఘకాలికంగా పరిష్కారం కావడంలేదని మసీద్ కమిటీ ఎంపీ ముందుంచింది. ఈ సందర్భంగా మసీదు కమిటీ సభ్యులు ఎంపీ భరత్‌ను ఘనంగా సన్మానించారు. తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రాన్ని అందించారు. నగరంలోని ముస్లింల సంక్షేమానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర నాయకుడు నజీర్, దక్షిణ టీడీపీ ఇన్‌చార్జ్ సీతంరాజు సుధాకర్, మక్కామసీద్ అధ్యక్షుడు అబ్దుల్ మజీర్, కార్యదర్శి సయ్యద్ అమీర్జాన్, కోశాధికారి మోహుద్దీన్, చిన్నరెహమాన్ తదితరులు పాల్గొన్నారు.

రైళ్లు ఫుల్

... 5వ పేజీ తరువాయి

రైళ్లలో కొన్ని తేదీల్లో బెర్తుల ఖాళీలున్నాయి.

చెన్నై వెళ్లే రైళ్లకు సాధారణ రద్దీ ఏర్పడింది. మెయిల్ (12839), కోరమండల్ (12841), బొకారో (13351) వంటి ప్రతిరోజు నడిచే రైళ్లతోపాటు భువనేశ్వర్-పాండిచ్చేరి (12898), షాలిమార్-త్రివేండ్రం (22642), గువహటి-బెంగళూరు (12510), హౌరా-తిరుచిరాపల్లి (12660), ముజఫర్‌పూర్-యశ్వంతపూర్ (15228), సంత్రాగచ్చి-చెన్నై ఏసీ ఎక్స్‌ప్రెస్ (22807), న్యూజలపాయ్‌గురి-మద్రాసు (22616) వంటి రైళ్లకు సాధారణ రద్దీ నెలకొంది.

సికింద్రాబాద్ రైళ్లకు అందుబాటులో బెర్తులు

సికింద్రాబాద్ వెళ్లే గోదావరి (12727), గరీబ్‌రథ్ (12739), కోణార్క్ (11020), ఫలక్‌నుమా (12703), వందేభారత్ (20833), విశాఖ-నాందేడ్ (20811), ఎల్‌టీటీ ఎక్స్‌ప్రెస్ (18519), దురంతో (22203) వంటి ప్రధాన రైళ్లకు దసరా రోజుల్లో కూడా బెర్తులు లభించే పరిస్థితి ఉంది. ఈ నెల 17వ తేదీ వరకు గోదావరి, గరీబ్‌రథ్, మహబూబ్‌నగర్, వందేభారత్, జన్మభూమి వంటి రైళ్లకు, ఈ నెల 18 నుంచి అక్టోబరు 12వ తేదీ వరకు బెర్తులు అందుబాటులో ఉన్నాయి. అయితే దసరా తర్వాత...అక్టోబరు 13 నుంచి అన్ని ప్రధాన రైళ్లకు డిమాండ్ ఏర్పడింది.

తిరుపతి, శ్రీకాకుళం మధ్య ప్రత్యేక రైళ్లు

విశాఖపట్నం, సెప్టెంబరు 12: దసరా, దీపావళి పండుగల నేపథ్యంలో ప్రయాణికుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని దువ్వాడ మీదుగా తిరుపతి, శ్రీకాకుళం రోడ్డు స్టేషన్ల మధ్య ప్రత్యేక రైళ్లను నడుపుతామని సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. 07447 నంబరు గల రైలు అక్టోబరు 6 నుంచి నవంబరు 10 వరకు ప్రతి ఆదివారం సాయంత్రం 5.10 గంటలకు తిరుపతిలో బయలుదేరి మరుసటిరోజు ఉదయం 7.55 గంటలకు దువ్వాడ, మధ్యాహ్నం 12.15 గంటలకు శ్రీకాకుళం రోడ్డు చేరుతుంది. తిరుగు ప్రయాణంలో 07448 నంబరు గల రైలు అక్టోబరు 7 నుంచి నవంబరు 1 వరకు ప్రతి సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు శ్రీకాకుళం రోడ్డు నుంచి బయలుదేరి సాయంత్రం 6.02 గంటలకు దువ్వాడ, మరుసటిరోజు ఉదయం 8.20 గంటలకు తిరుపతి చేరుతుంది.

నేడు జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సమావేశం

విశాఖపట్నం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సమావేశం శుక్రవారం జరగనున్నది. మేయర్ గొలగాని హరివెంకటకుమారి అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో చర్చించేందుకు 280 అంశాలతో ఎజెండాను తయారుచేశారు. కొత్త కమిటీ ఎన్నికైన తర్వాత తొలి సమావేశం కావడంతో ప్రాధాన్యం సంతరించుకుంది. సాధారణంగా స్టాండింగ్ కమిటీ సమావేశానికి 50 అంశాలకు మించకుండా ఎజెండా తయారుచేస్తుంటారు. కానీ ఈ సమావేశానికి 280 అంశాలతో ఎజెండా తయారుచేయడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇంతవరకూ స్టాండింగ్ కమిటీ సమావేశాలన్నీ ఉదయం 11 నుంచి మధ్యాహ్నం రెండు గంటలు వరకు జరిగాయి. మూడు గంటల్లో 280 అంశాలను చర్చించి, ఆమోదంపై నిర్ణయం తెలపడం ఎలా సాధ్యమనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. కమిటీలోని కొందరు సభ్యులు, అధికారులు కొన్ని అంశాల విషయంలో ఇప్పటికే ఒక నిర్ణయానికి వచ్చేశారని, వాటిని మాత్రమే ఆమోదించి, మిగిలిన అంశాలను వాయిదా వేసే అవకాశం ఉందంటున్నారు. తాజా ఎజెండాలోని అంశాలన్నీ వైసీపీ ప్రభుత్వ హయాంలో చేసిన పనులకు సంబంధించినవి కావడంతో సభ్యులు ఎలాంటి నిర్ణయం తీసుకుంటారనేది వేచిచూడాలి.

లక్ష్మీ వినాయక ఆలయంలో విద్యా గణపతి అవతారం



విద్యాగణపతిగా లక్ష్మీ వినాయకుడు, మురళీనగర్ గణపతికి గరిక పూజ

జాతీయ రహదారి తాటిచెట్లపాలెం వద్ద గల ఆంధ్రజ్యోతి కార్యాలయం సమీపంలో ఉన్న లక్ష్మీ వినాయక ఆలయంలో గణనాథుడు గురువారం విద్యాగణపతిగా దర్శనమిచ్చాడు. కాగా మురళీనగర్ బృందావన్ పార్క్ సమీపంలో కొలువుదీరిన గణపతికి గురువారం గరిక పూజను ఘనంగా నిర్వహించారు. **- మురళీనగర్**

రూ.1,11,006 పలికిన దుర్గా గణపతి లడ్డూ

సీతంపేట, సెప్టెంబరు 12: సీతంపేట దుర్గాగణపతి ఆలయంలో నిర్వహిస్తున్న నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన 99 కిలోల లడ్డూను ఉత్సవ కమిటీ సారిపిల్లి గోవింద్ ఆధ్వర్యంలో గురువారం వేలం వేశారు. స్టీల్ సిటీ సెక్యూరిటీస్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ సతీష్‌కుమార్ ఆర్య స్వామి లడ్డూను రూ.1,11,006కు దక్కించుకున్నారు. దీనిని భక్తులకు ప్రసాదంగా అందిస్తామని ఆయన తెలిపారు.

అదృశ్యమైన ఫార్మా ఉద్యోగి మృతి

- 'అడ్మిరాన్' పరిశ్రమ మిథనాల్ ట్యాంక్‌లో శవమై తేలిన సూర్యనారాయణ



సూర్యనారాయణ (ఫైల్)

పరవాడ, సెప్టెంబరు 12: ఫార్మాసిటీలోని అడ్మిరాన్ లైఫ్ సైన్సెస్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమలో మంగళవారం అదృశ్యమైన ఆర్.సూర్యనారాయణ(40) పరిశ్రమ ఆవరణలోని మిథనాల్ ట్యాంక్‌లో శవమై తేలాడు. ఈ విషయాన్ని గురువారం ఉదయం యాజమాన్యం గుర్తించింది. పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు.పరిశ్రమలో ప్రొడక్షన్ మేనేజర్‌గా పనిచేస్తున్న ఆర్.సూర్యనారాయణ మంగళవారం జనరల్ షిఫ్ట్‌కు హాజరయ్యాడు. సాయంత్రం ఇంటికి రాకపోవడంతో కుటుంబీకులు వాకబు చేశారు. ఆచూకీ లభించలేదు. దీంతో పరవాడ పోలీసులకు ఫిర్యాదు చేశారు. గురువారం పరిశ్రమలో గాలింపు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో మిథనాల్ ట్యాంకు పైకి ఎక్కి చూడగా అందులో సూర్యనారాయణ మృతదేహం కనిపించింది. అగ్నిమాపక సిబ్బంది ట్యాంకులోకి నీరు నింపి, మృతదేహాన్ని పైకి తేలేలా చేసి బయటకు తీశారు.

మృతుడి కుటుంబసభ్యుల ఆందోళన

యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగానే సూర్యనారాయణ ప్రాణాలు కోల్పోయాడని, రూ.కోటి నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ కుటుంబసభ్యులు, బంధువులు పరిశ్రమ ప్రధాన ద్వారం వద్ద గురువారం ఆందోళనకు దిగారు. మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించేందుకు సిద్ధమవుతుండగా అడ్డుకున్నారు. దీనిపై జడ్పీటీసీ సభ్యుడు పైలా సన్యాసిరాజు, మాజీ ఎంపీపీలు పైలా జగన్నాథరావు, మాదంశెట్టి నీలబాబు, టీడీపీ నేతలు యాజమాన్యంతో చర్చలు జరిపారు. రూ.50 లక్షలు నష్టపరిహారంతోపాటు దహన సంస్కారాలకు మరో లక్ష రూపాయలు ఇచ్చేందుకు యాజమాన్యం అంగీకరించింది. అనంతరం సూర్యనారాయణ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. సూర్యనారాయణకు భార్య బాల పరమేశ్వరి, కుమార్తె జ్యోషిత, కుమారుడు సృజన్ ఉన్నారు. ఇతని స్వస్థలం విజయనగరం జిల్లా వేపాడ మండలం వీలుపర్తి గ్రామం.

'మెడ్‌టెక్‌ను ప్రభుత్వమే నిర్వహించాలి'

మురళీనగర్, సెప్టెంబరు 12: ప్రతిష్ఠాత్మకమైన మెడ్‌టెక్ విశ్వవిద్యాలయాన్ని ప్రభుత్వ రంగంలోనే నిర్వహించాలని రాష్ట్ర కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ, మూల వెంకటరావు సూచించారు.పెదగంట్యాడ వద్ద గ్రీన్ ఫీల్డ్ గ్లోబల్ విశ్వవిద్యాలయంలో 2025-26 నుంచి తరగతులు ప్రారంభించాలనే ప్రణాళిక మంచిదేనన్న ఆయన ప్రైవేటు, ప్రభుత్వ భాగస్వామ్యంతో నిర్వహించాలన్న ఆలోచన ఆందోళనకరమన్నారు. అత్యంత ఖరీదైన కోర్సులు సామాన్యులు, వెనుకబడిన తరగతుల విద్యార్థులకు దూరమవుతాయన్నారు. మెడ్‌టెక్‌లో పరిశోధన, శిక్షణ, ఉద్యోగాలు సామాన్యులకు దక్కాలంటే ప్రభుత్వమే నిర్వహించాలని వెంకటరావు కోరారు.

కనకమహాలక్ష్మి ఆలయంలో పవిత్రోత్సవాలకు శ్రీకారం

పూర్ణామార్కెట్, సెప్టెంబరు 12: వన్‌టౌన్ కనక మహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో శుక్రవారం నుంచి పవిత్రోత్సవాలు నిర్వహించేందుకు అధికారులు సన్నాహాలు పూర్తిచేశారు. గురువారం ఈవో శ్రీనివాసుల రెడ్డి, వేదపండితులు, అర్చకులతో ప్రత్యేకంగా సమీక్షించారు. శుక్రవారం సాయంత్రం 5.30 గంటలకు పవిత్రోత్సవాలు ప్రారంభమవుతాయి. 16 వరకు నిర్విరామంగా జరిపేందుకు నిర్ణయించారు.

ఎర్నిమాంబ ఆలయానికి రూ.19 లక్షల ఆదాయం

జ్ఞానాపురం, సెప్టెంబరు 12: అచ్చియ్యమ్మపేట గ్రామదేవత ఎర్నిమాంబ అమ్మవారి ఆలయం హుండీ లెక్కింపు గురువారం చేపట్టారు. దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ బి.వసంతకుమార్ పర్యవేక్షణలో గోపాలపట్నం శ్రీహరి సేవా సంఘం సహకారంతో లెక్కించగా జులై 10 నుంచి సెప్టెంబరు 12 వరకు రూ.19,09,917 ఆదాయం వచ్చినట్లు ఈవో డీవీఎస్ సురేష్ బాబా తెలిపారు.

ఏచూరి మృతికి సీపీఐ సంతాపం

అల్లిపురం, సెప్టెంబరు 12: భారత కమ్యూనిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మృతి పట్ల సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జె.వి.సత్యనారాయణమూర్తి, రాష్ట్ర సమితి సభ్యుడు సీహెచ్ రాఘవేంద్రరావు, జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు సంతాపం తెలిపారు. రాజకీయాలకు అతీతంగా గుర్తింపు తెచ్చుకున్న నేత ఏచూరి అని, ఆయన మరణం దేశ రాజకీయాలకు ముఖ్యంగా వామపక్ష ఉద్యమాకి తీరని లోటని వారు అన్నారు.

డాబాగార్డెన్స్: సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి జీవితం ఆదర్శమైనదని జీవీఎంసీ కాంట్రాక్టు వర్కర్స్ లేబర్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు ఎం.ఆనందరావు అన్నారు. కార్యకర్తల కోసం పరితపించే వ్యక్తి ఏచూరి అని శ్లాఘించారు. ఆయన మృతి దేశానికే తీరని లోటన్నారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నామన్నారు.

జాతీయ సీనియర్ ఆక్వాటిక్ టోర్నీలో సంపత్‌కుమార్‌కు కాంస్యం



సంపత్‌కుమార్ యాదవ్‌తో మోహన్ వెంకటరామ్

విశాఖపట్నం (స్పోర్ట్సు), సెప్టెంబరు 12: కర్ణాటకలోని మంగళూరులో జరుగుతున్న జాతీయ సీనియర్ ఆక్వాటిక్ చాంపియన్‌షిప్ టోర్నీలో విశాఖకు చెందిన జి.సంపత్‌కుమార్ యాదవ్ అద్భుత ప్రతిభ కనబరిచాడు. బుధవారం రాత్రి నిర్వహించిన 800 మీటర్ల ఫ్రీ స్టైల్ ఈవెంట్‌లో కాంస్య పతకం సాధించాడు. సంపత్‌కుమార్ యాదవ్...800 మీటర్ల రేస్‌ను 8:28:35 నిమిషాల్లో పూర్తి చేసి పతకం దక్కించుకున్నాడు. దాదాపు 32 ఏళ్ల తర్వాత జాతీయ స్విమ్మింగ్ టోర్నీలో పురుషుల కేటగిరీలో ఆంధ్రప్రదేశ్‌కు పతకం అందించిన ఘనతను సొంతం చేసుకున్నాడు. అరుదైన ఘనత సాధించిన సంపత్‌కుమార్‌ను ఆంధ్రప్రదేశ్ స్విమ్మింగ్ సంఘం ప్రధాన కార్యదర్శి మోహన్ వెంకటరామ్, ఇతర ప్రతినిధులు, సీనియర్ స్విమ్మర్లు, కోచ్‌లు అభినందించారు.

రక్షణ కల్పించండి

- సీపీని వేడుకున్న ఎన్ఆర్ఐ దంపతులు



సీపీ కార్యాలయం వద్ద ఎన్ఆర్ఐ దంపతులు

మహారాణిపేట, సెప్టెంబరు 12: సొంత స్థలాన్ని ఆక్రమించుకోవడమే కాకుండా, దాడికి తెగబడ్డారని, ప్రాణాలు అరచేత పట్టుకుని బతికిబయట పడ్డామని, రక్షణ కల్పించాలని ఎన్ఆర్ఐ దంపతులు గురువారం నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీని వేడుకున్నారు. వారు తెలిపిన వివరాల మేరకు... ఎన్ఆర్ఐ దంపతులు చిరికి నాయుడు, వెంకటపద్మ పెందుర్తి సమీపంలోని సింహపురి కాలనీ మైత్రీనగర్ లే అవుట్‌లో సుమారు 466 గజాల స్థలాన్ని 2004లో కొనుగోలు చేశారు. వారు విదేశాల్లో ఉన్నప్పటికీ 2014 వరకు ఆ స్థలం వారి అధీనంలోనే ఉంది. అయితే దీనిపై కన్నేసిన రౌడీ షీటర్లు దుంబూరి ప్రభాకర్, డీపీ మహేశ్ అనుచరులు స్థలాన్ని కబ్జా చేశారు. ఈ నేపథ్యంలో ఎన్ఆర్ఐ దంపతులు కోర్టును ఆశ్రయించారు. దీనిపై ఇటీవల కోర్టు ఆ స్థలం ఎన్ఆర్ఐ దంపతులదేనని తీర్పునిచ్చింది. ఈ నేపథ్యంలో గురువారం ఆ స్థలంలో పనులు చేపడుతుండగా సుమారు 20 మందికి పైగా వచ్చి, తమపై దాడి చేశారని, పోలీసులకు ఫిర్యాదు చేయకుండా తమవద్ద ఉన్న సెల్‌ఫోన్లు లాక్కుని, రక్తం వచ్చేలా కొట్టారని, దేవుడి దయతో ప్రాణాలతో బయటపడ్డామని వాపోయారు. తమ ప్రాణాలకు రక్షణ కల్పించి, స్థలం విషయంలో న్యాయం చేయాలని సీపీ శంఖబ్రత బాగ్చీని వేడుకున్నారు.

రౌడీషీటర్లు జిల్లా విడిచి పారిపోవాలి: సీపీ

ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ నగరంలో రౌడీ షీటర్లకు రెండే మార్గాలున్నాయన్నారు. ఉంటే జైల్లో ఉండాలని, లేదంటే ఎలాంటి వివాదాల జోలికి వెళ్లకుండా సన్మార్గంలో నడుచుకోవాలన్నారు. నేరాలు చేస్తామంటే పీడీ యాక్ట్ అమలు చేసి, కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అలాంటి ఆలోచన ఉన్న రౌడీషీటర్లంతా జిల్లా విడిచి పారిపోవాలని హెచ్చరించారు.

భక్తి ముసుగులో వ్యాపారం

... 5వ పేజీ తరువాయి

చేసుకుంటున్నారు. దర్శనానికి టికెట్లు పెట్టారు. వ్యాపారాలకు స్టాళ్లు అద్దెకు ఇచ్చారు. సింధియాలో ప్రత్యేకంగా ఈసారి బెల్లం వినాయకుడి విగ్రహం ఏర్పాటుచేశారు. బెల్లం తయారీకి ఫేమస్ అయిన అనకాపల్లి కూతవేటు దూరంలో ఉండగా, ఆ బెల్లం కాకుండా రాజస్థాన్ నుంచి తెప్పించిన 20 టన్నుల బెల్లాన్ని ఉపయోగించామని చెబుతున్నారు. సుమారు 75 అడుగుల ఎత్తున విగ్రహం ఏర్పాటుచేశారు. స్వామిని దర్శించుకోవడానికి టికెట్ పెట్టారు. జాతరలా వ్యాపారాలకు అనుమతి ఇచ్చారు. వ్యాపారం కోసం 21 రోజులు నిర్వహిస్తున్నారు.

వీటికి ఏ తరహా అనుమతులు ఇచ్చారో..?

చిన్న మండపం పెట్టి పూజలు చేసినా అనుమతి తీసుకోవాలని పోలీసులు నిబంధన పెట్టారు. మరి ఎంవీపీ కాలనీ, గాజువాక, సింధియాల్లో భారీఎత్తున 21 రోజుల పాటు నిర్వహిస్తుంటే పోలీసులు ఎలా అనుమతి ఇచ్చారనేది అనుమానంగా ఉంది. రాజకీయ నాయకులు ప్రోత్సహించడం వల్ల పోలీసులు అడ్డు చెప్పలేకపోతున్నట్టు తెలిసింది. అయితే వ్యాపారంలా చేయడమే అభ్యంతరకరం. ఊహించని ప్రమాదాలు జరగక ముందే వీటిని ఎంత వేగంగా నిమజ్జనం చేస్తే అంత మంచిది. దేశంలో ముంబై తరువాత అంత ప్రాముఖ్యత కలిగిన హైదరాబాద్ (ఖైరతాబాద్) వినాయకుడిని కూడా తొమ్మిది రోజుల తరువాత నిమజ్జనం చేస్తారు. ఇక్కడ కూడా అదే తరహా విధానం పాటించాలి.

జీవీఎంసీలోకి 64 పంచాయతీలు

... 5వ పేజీ తరువాయి

మండలంలో 16 పంచాయతీల ప్రజా ప్రతినిధుల అభిప్రాయాలు కూడా తీసుకున్నామన్నారు. రెండు లక్షల జనాభా, 1.25 లక్షల ఓటర్లు కలిగిన ఈ ప్రాంతాల్లో విలీనం తరువాత పదేళ్లపాటు పన్నులు పెరగకుండా మినహాయింపు తీసుకుంటామన్నారు. టీడీపీ హయాంలోనే 2017లో కాపులుప్పాడ, చేపలుప్పాడ పంచాయతీలు జీవీఎంసీలో విలీనమయ్యాయన్నారు. మధురవాడ, భీమిలి జీవీఎంసీలో ఉంటూ మధ్యలో ప్రాంతాలు పంచాయతీలుగా ఉండడం వల్ల పరిపాలనాపరమైన ఇబ్బందులు వస్తున్నాయన్నారు. విలీనం తరువాత ఏడాదిన్నరపాటు ఎన్ఆర్ఈజీఎస్ ఉపాధి హామీ పనులు చేసుకునే అవకాశం ఉందన్నారు. భోగాపురం విమానాశ్రయంతో సమాంతరంగా ఎలివేటెడ్ కారిడార్లు, ఫ్లైఓవర్ బ్రిడ్జిలు, మెట్రో రైలు పనులు చేపట్టేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నారన్నారు. ఇందుకు అనుగుణంగా భీమిలిలో మెయిన్ రోడ్డు, బీచ్ రోడ్డు, లక్ష్మీనరసింహస్వామి ఆలయం రోడ్డు విస్తరిస్తున్నామని చెప్పారు.

సాయిరెడ్డి నిర్మాణాల కూల్చివేత ఆరంభమే

భీమిలి బీచ్‌లో ఎంపీ విజయసాయిరెడ్డి కుమార్తె నేహారెడ్డి చేపట్టిన నిర్మాణాల కూల్చివేతపై విలేకరులు ప్రశ్నించగా, ఇది ఆరంభం మాత్రమేనన్నారు. వైసీపీ పెద్దలు బెదిరించి భూములు రాయించుకున్నారని, వీటిని వైజాగ్ ఫైల్స్ పేరుతో బయటపెడతామని చెప్పారు. విజయవాడలో వరద బాధితులకు సహాయక కార్యక్రమాలు చేపట్టడానికి చంద్రబాబునాయుడు 11 రోజులు కలెక్టరేట్‌లోనే ఉండి పనులు పర్యవేక్షించారని, ఆయన రోల్‌మోడల్ సీఎం అని ప్రశంసించారు. వరద బాధితులు కష్టాల్లో ఉంటే జైల్లో ఉన్న అనుచరుడిని చూడడానికి వైసీపీ అధ్యక్షుడు జగన్ మోహన్ రెడ్డి వెళ్లారని, ప్రజలంతా దీనిని గమనిస్తున్నారన్నారు. విపత్తును కూడా రాజకీయం చేసిన కుసంస్కారి జగన్ అని విమర్శించారు. ఈ సమావేశంలో జనసేన నాయకుడు పంచకర్ల సందీప్, మాజీ ఎమ్మెల్యే అప్పలనాయుడు, కార్పొరేటర్లు గాడు చిన్నికుమారి, లొడగల అప్పారావు పాల్గొన్నారు.

విజృంభిస్తున్న దోమలు

జ్వరాల బారిన పడుతున్న ప్రజలు

వార్డుల్లో పేరుకుపోయిన మురుగు, వర్షపు నీరే కారణం

అధికారులు తగిన చర్యలు చేపట్టాలని స్థానికుల వేడుకోలు

గాజువాక, సెప్టెంబరు 12: పారిశ్రామిక ప్రాంత ప్రజలు దోమల బెడదతో అల్లాడుతున్నారు. ప్రతీ వార్డులో దోమల బెడద అధికం కావడంతో ప్రజలు అనారోగ్యాల బారినపడుతున్నారు. ప్రధానంగా జ్వరాలు విజృంభిస్తుండడంతో జ్వరపీడితుల సంఖ్య రోజు రోజుకు ఆస్పత్రులకు పెరుగుతున్నట్టు వైద్య వర్గాలు పేర్కొంటున్నాయి. కాలువల్లో మురుగు పేరుకుపోవడం, ఇటీవల కురిసన వర్షాలకు నీరు ఎక్కడికక్కడ తిష్ట వేయడంతో పాటు ఇళ్ల పరిసరాల్లో పరిశుభ్రత లోపించడం వల్ల దోమలు స్వైరవిహారం చేస్తున్నాయి. దోమల వల్ల జ్వరాలు ప్రబలుతున్నందున ప్రజలందరూ తమ పరిసర ప్రాంతాలతో పాటు ఇళ్లల్లో నీటి నిల్వలు ఎక్కడా ఉండకుండా చూసుకోవాలని వైద్య, ఆరోగ్య శాఖ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు.



గాజువాక సమీప గొంతినవానిపాలెంలో గెడ్డలో పేరుకుపోయిన మురుగు నిల్వలు

తిష్ట వేసిన వర్షపు నీరు

ఇటీవల కురిసిన వర్షాల కారణంగా కాలనీలు, జనావాసాల మధ్య వర్షపు నీరు రోజుల తరబడి ఎక్కడికక్కడ నిలిచిపోవడంతో దోమల తాకిడి అధికమవుతుంది. దీంతో లార్వా వృద్ధి చెంది దోమలు పరిసర ప్రాంతాల్లో ఉన్న ఇళ్లల్లోకి ప్రవేశిస్తున్నాయి. లార్వా వృద్ధి చెందకుండా క్రిమిసంహారక మందులు చల్లడంతో పాటు సాయంత్రం పూట కాలనీల్లో ఫాగింగ్ చేస్తే దోమల బెడద తగ్గుతుందని ప్రజలు పేర్కొంటున్నారు. అయితే ఆ దిశగా సంబంధిత శాఖ అధికారులు పూర్తి స్థాయిలో చర్యలు చేపట్టడం లేదని ఆరోపిస్తున్నారు. పలు ప్రాంతాల్లో కాలువల్లో పేరుకుపోయిన మురుగు, వర్షపు నీరు బయటకు పోయేలా తగిన చర్యలు చేపట్టి దోమల నివారణకు కృషి చేయాలని కోరుతూ పలు వార్డులకు చెందిన ప్రజలు గాజువాక జోనల్ కమిషనర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు.

కుల ధ్రువీకరణ పత్రాలు అందజేయాలని వినతి

సింధియా, సెప్టెంబరు 11: తమకు కుల ధ్రువీకరణ పత్రాలు అందజేయాలని కోరుతూ 63వ వార్డుకు చెందిన ఒరియా సంఘం నాయకులు గురువారం పశ్చిమ ఎమ్మెల్యే పీజీవీఆర్ నాయుడు (గణబాబు)కు వినతిపత్రం అందజేశారు. ఒడిశా నుంచి బతుకుతెరువు కోసం తాము వలస వచ్చి కొన్ని దశాబ్దాలుగా 63వ వార్డు ప్రాంతంలో నివసిస్తున్నామని, ఇక్కడ స్థిర నివాసాలు ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్నామని ఎమ్మెల్యేకు వివరించారు. తమకు కుల ధ్రువీకరణ పత్రాలు లేకపోవడంతో ప్రభుత్వం నుంచి రావాల్సిన సంక్షేమ పథకాలేవీ తమకు అందడం లేదని పేర్కొన్నారు. అందువల్ల తమకు కుల ధ్రువీకరణ పత్రాలు జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై గణబాబు వెంటనే కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడి విషయాన్ని వివరించారు. కలెక్టర్ కూడా సానుకూలంగా స్పందించినట్టు ఆయన పేర్కొన్నారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో కార్పొరేటర్ గల్లా చిన్నా, ఒరియా సంఘం నాయకులు పట్నాయక్, సాహు, మహారాణా, తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే గణబాబుకు సమస్యలను వివరిస్తున్న దృశ్యం

సాలాపువానిపాలెంలో 19 నుంచి రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు

అక్కిరెడ్డిపాలెం, సెప్టెంబరు 12: వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా సాలాపువానిపాలెంలో ఈ నెల 19 నుంచి రాష్ట్ర స్థాయి మహిళల, పురుషుల కబడ్డీ పోటీలను నిర్వహించనున్నట్లు రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ కార్యనిర్వాహక కార్యదర్శి ఉరుకూటి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు విద్యుత్ దీప కాంతుల్లో మ్యాట్‌పై ఈ పోటీలు జరుగుతాయన్నారు. రాష్ట్ర స్థాయి మహిళల, పురుషుల కబడ్డీ పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచిన జట్టుకు రూ.30 వేలు, ద్వితీయ స్థానానికి రూ.20 వేలు, తృతీయ స్థానానికి రూ.15 వేలు, నాలుగో స్థానంలో నిలిచిన జట్టుకు పది వేల రూపాయలను నగదు బహుమతిగా అందజేయడం జరుగుతుందన్నారు. ఈ పోటీల్లో పాల్గొనదలచిన వారు 7680005666 సెల్ నంబర్‌ను సంప్రదించవలసిందిగా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పి.కోటీశ్వరరావు కోరారు.

బీఆర్టీఎస్ రోడ్డులో గోతులు పూడ్చివేత

పెందుర్తి, సెప్టెంబరు 12: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పెందుర్తి నుంచి వేపగుంట బీఆర్టీఎస్ రహదారిలో గోతులు పడ్డాయి. ఈ రోడ్డులో తరచూ ప్రమాదాలు జరుగుతుండడంతో పెందుర్తి ట్రాఫిక్ పోలీసులు గుంతల పూడ్చివేతకు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో గురువారం ట్రాఫిక్ ఎస్‌ఐ నరసింహారావు ఆధ్వర్యంలో సిబ్బంది గోతులను పూడ్చి వేయించారు.

చెకుముఖి పోస్టర్ ఆవిష్కరణ

గాజువాక, సెప్టెంబరు 12: జన విజ్ఞాన వేదిక గాజువాక శాఖ, స్టీల్ సిటీ జోన్ కమిటీ ఆధ్వర్యంలో చెకుముఖి సైన్స్ సంబరాలు-2024 పోస్టరును గురువారం ఇక్కడ బాలల హక్కుల రక్షణ కమిటీ సభ్యుడు గొండు సీతారాం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు ఎస్వీకే పరశురాం మాట్లాడుతూ విద్యార్థుల్లో సైంటిఫిక్ టెంపర్ అభివృద్ధి చేసేందుకు, భావిభారత శాస్త్రవేత్తలను తయారుచేసేందుకు జనవిజ్ఞాన వేదిక కృషి చేస్తుందన్నారు. ఇందులో భాగంగా ఈ నెల 25న పాఠశాల స్థాయి పోటీలు, అక్టోబరు 12న మండల స్థాయి, 27న జిల్లా స్థాయి, నవంబరు 9, 10 తేదీల్లో రాష్ట్రస్థాయి పోటీలను నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ఎంఈవోలు సునిత, విశ్వనాథం పాల్గొన్నారు.

'ప్రజా సంక్షేమమే బీజేపీ లక్ష్యం'

గాజువాక, సెప్టెంబరు 12: ప్రజా సంక్షేమమే బీజేపీ లక్ష్యమని ఆ పార్టీ గాజువాక నియోజకవర్గ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు అన్నారు. గాజువాకలో గురువారం నిర్వహించిన సభ్యత్వ నమోదులో మాట్లాడారు. సభ్యత్వాలకు ప్రజల నుంచి మంచి స్పందన వస్తుందన్నారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్ ప్రవేశాలకు 15 వరకు గడువు

ఆరిలోవ, సెప్టెంబరు 12: ఓపెన్ స్కూల్ టెన్త్, ఇంటర్ ప్రవేశాలకు అర్హులైన వారు ఈనెల 15వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని డీఈఓ ఎల్.చంద్రకళ తెలిపారు. ఈ మేరకు గురువారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. రూ. 200 అపరాధ రుసుముతో ఈనెల 25 వరకు దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. పదో తరగతిలో ప్రవేశానికి 14 ఏళ్లు నిండినవారు, ఇంటర్ ప్రవేశానికి టెన్త్ ఉత్తీర్ణులైన వారు అర్హులన్నారు.

స్వయం ఉపాధి శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ఆరిలోవ. సెప్టెంబరు 12: మహిళా ప్రాంగణంలో నిరుద్యోగ మహిళలకు స్వయం ఉపాధి శిక్షణ ఇవ్వనున్నట్టు ప్రాంగణాధికారి విమల తెలిపారు. బేసిక్ సూయింగ్ మిషన్ ఆపరేటర్, బ్యూటీషియన్, మగ్గం వర్క్ విభాగాల్లో శిక్షణ ఇస్తామని, ఆసక్తి గల వారు ఈనెల 18లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

సినిమా గైడ్

- **మత్తు వదలరా-2 :** మెలోడి, శరత్, శ్రీరామ, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), నటరాజ్ (పెందుర్తి), మినీ మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), గణేష్ (తగరపువలస)
- **భలే ఉన్నాడే :** రమాదేవి, శ్రీకన్య, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), మోహిని (గాజువాక), రాములమ్మ (తగరపువలస)
- **ఎ.ఆర్.ఎం. :** శారద, కామేశ్వరి, సౌజన్య (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక)
- **35 :** కిన్నెర, వెంకటేశ్వర, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం),
- **సరిపోదా శనివారం :** జగదాంబ, సంగం, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), కన్య-1 (గాజువాక), సీతారామయ్య (పరవాడ), తాతా (తగరపువలస)
- **ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్ :** శ్రీరామ, లక్ష్మీకాంత్ (గాజువాక), అన్నపూర్ణ (కుర్మన్నపాలెం)
- **ఉత్సవం :** శ్రీవెంకటేశ్వర, శ్రీనరసింహ (గోపాలపట్నం), మోహిని (గాజువాక)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 45, టమాటా 30, వంకాయలు (తెలుపు) 46, వంకాయలు (నలుపు) 64, బెండకాయలు 55, పచ్చిమిర్చి 38, కాకరకాయలు 40, బీరకాయలు 50, ఆనపకాయ 35, కాలీఫ్లవర్ 34, క్యాబేజి 26, క్యారెట్ 36, దొండకాయలు 44, బంగాళదుంపలు 29, అరటికాయ 8, మునక్కాడలు (కిలో) 65, అల్లం 70, బీట్‌రూట్ 32, బరబాటి 50, ముల్లంగి 28, నిమ్మకాయలు (కిలో) 105, గోరు చిక్కుడు 34, దోసకాయలు 36, వెల్లుల్లి 240, కొబ్బరికాయ 25, బీన్స్ (పెన్సిల్) 110, పొటల్స్ 50, కీరదోస 32, కాప్సికమ్ 70, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 48, చిలగడదుంపలు 54, కంద 54, దేముడు చిక్కుడు 70, కొండఉసిరి 75, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్ద కట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 5, పాలకూర (కట్ట) 5, తోటకూర (కట్ట) 5, మామిడికాయలు 70, బూడిదగుమ్మడికాయ 30, కర్రపెండలం 26, మామిడి అల్లం 70, బొప్పాయి 30, జామకాయలు (కిలో) 60.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	535
విజయనగరం	539
శ్రీకాకుళం	539

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	--	95
ఫారం ధర	--	115
విత్ స్కిన్	--	200
స్కిన్‌లెస్	--	210

కొత్తపాలెం శివారులో ముంపు నివారణ చర్యలు

వ్యవసాయ క్షేత్రాల మీదగా కాలువల తవ్వకాలు

గోపాలపట్నం, సెప్టెంబరు 12: వర్షాకాలంలో కొత్తపాలెం గ్రామ శివారులో ముంపు సమస్య కారణంగా కొత్తపాలెం-నరవ గ్రామాల రహదారిలో ప్రజల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ క్రమంలో ఇటీవల జిల్లా కలెక్టర్, జీవీఎంసీ కమిషనర్ ఈ ప్రాంతాల్లో పర్యటించి ముంపు సమస్యకు గల కారణాలను అధ్యయనం చేసి నివారణ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. దీంతో ముంపు సమస్యలపై అధికారులు పరిశీలన చేయగా.. ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే నీరు సజావుగా ప్రవహించడానికి కాలువలు లేకపోవడం, గతంలో ఉన్న కాలువలను పూడ్చివేయడమే ముంపు సమస్యకు ప్రధాన కారణంగా గుర్తించారు. ఈ మేరకు వెంకటాపురం నుంచి కొత్తపాలెం గ్రామ శివారు వరకు సర్వే నిర్వహించి ఆక్రమణకు గురైన కాలువల పునరుద్ధరణ చర్యలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా కొత్తపాలెం గ్రామంలోని వ్యవసాయ క్షేత్రాల మీదుగా కాలువ తవ్వకాలు చేపడుతున్నారు.



వెంకటాపురం-కొత్తపాలెం గ్రామాల మధ్య తవ్విన కాలువ

ప్రజలంతా సోలార్ రూఫ్ టాప్‌లను ఏర్పాటు చేసుకోవాలి

ఏపీఈపీడీసీఎల్ జోన్-2 ఈఈ బీకే నాయుడు

ఆటోనగర్, సెప్టెంబరు 12: విద్యుత్ బిల్లులను తగ్గించుకునేందుకు అందరూ విధిగా ప్రధాన మంత్రి సూర్య ఘర్ యోజన పథకంలో చేరాలని, సోలార్ రూఫ్ టాప్‌ను ఏర్పాటు చేసుకోవలసిందిగా ఏపీఈపీడీసీఎల్ జోన్-2 ఈఈ బీకే నాయుడు కోరారు. ఆటోనగర్‌లోని విద్యుత్ శాఖ కార్యాలయంలో గురువారం నిర్వహించిన వినియోగదారుల అవగాహన సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. పేద, మధ్యతరగతి ప్రజలకు విద్యుత్ బిల్లులను తగ్గించడమే కాకుండా, ఇంధన రంగంలో భారత్ స్వావలంబన దిశగా పయనించేందుకు కేంద్ర ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రవేశపెట్టిందన్నారు. ఆటోనగర్, గాజువాక ఏడీఈలు ఎ.పార్థసారథి, సీహెచ్ మీనకేతన్ రావులు మాట్లాడుతూ ఈ పథకం ద్వారా కేంద్ర ప్రభుత్వం సబ్సిడీ ద్వారా వినియోగదారులకు లబ్ధి చేకూరుతుందన్నారు. ఒక కిలోవాట్ రూఫ్ టాప్ వ్యవస్థకు రూ.30 వేలు, రెండు కిలోవాట్ల వ్యవస్థకు రూ.60 వేలు, మూడు కిలోవాట్ల వ్యవస్థకు రూ.78 వేలు కేంద్రం నుంచి రాయితీ లభిస్తుందన్నారు. పెట్టుబడుల కోసం ఎటువంటి పూచీకత్తు లేకుండా తక్కువ వడ్డీకే రుణం తీసుకునే అవకాశాన్ని కేంద్ర ప్రభుత్వం కల్పిస్తుందని పేర్కొన్నారు. ఏఈ ఆర్వీ రామకృష్ణ సౌర విద్యుత్ వల్ల కలిగే బహుళ ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ ప్రతినిధులు మల్లికార్జున్, మధు, సోలార్ ఎగ్జిక్యూటివ్‌లు, విద్యుత్ శాఖ సిబ్బంది, పలువురు వినియోగదారులు పాల్గొన్నారు.



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఈఈ బీకే నాయుడు



ఉల్లిపాయల కోసం రైతు బజారులో బారులుతీరిన కొనుగోలుదారులు

ఉల్లి కోసం బారులుతీరిన కొనుగోలుదారులు

గాజువాక, సెప్టెంబరు 12: ఉల్లిపాయలు, టమాట ధర రోజురోజుకు పెరుగుతుండడంతో రైతు బజారులోని వీటి స్టాళ్ల వద్ద కొనుగోలుదారులు బారులుతీరుతున్నారు. దీంతో రైతు బజారులోని ఆయా కౌంటర్లు కొనుగోలుదారులతో కిటకిటలాడుతున్నాయి. ఎక్కువ మంది ఉల్లి, టమాటా కొనుగోలుకు వస్తుండడంతో క్యూ పద్ధతిని అమలు చేస్తూ వీటిని విక్రయిస్తున్నారు. గురువారం ఇక్కడి రైతు బజారుకు వచ్చిన రెండు గంటల్లోనే ఉల్లిపాయలు అయిపోయాయి. ప్రస్తుతం రైతుబజారులో కిలో ఉల్లిపాయలు రూ.51, కిలో టమాటా 31 రూపాయలకు విక్రయిస్తున్నారు. అదే బహిరంగ మార్కెట్‌లో అయితే ఉల్లి కిలో రూ.70 నుంచి రూ.80, కిలో టమాటా 50 రూపాయలకు అమ్ముతున్నారు. దీంతో అత్యధిక శాతం కొనుగోలుదారులు రైతు బజార్లకు తరలివస్తున్నారు.

'వార్డులో సమస్యల పరిష్కారానికి కృషి'

అక్కిరెడ్డిపాలెం, సెప్టెంబరు 12: జీవీఎంసీ 69వ వార్డు పరిధిలోని మాజీ సైనికుల కాలనీ, హరిజన జగ్గయ్యపాలెం కాలనీలో గురువారం కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి పర్యటించారు. కాలువలు, రహదారులను పరిశీలించడంతో పాటు స్థానిక సమస్యలను ప్రజలను అడిగి తెలుసుకున్నారు. కాలువలు లేక ఏటా వర్షాకాలంలో ముంపునకు గురవుతున్నామని మాజీ సైనికుల కాలనీ ప్రజలు కార్పొరేటర్‌కు విన్నవించారు. దీంతో కాలనీలో కాలువల నిర్మాణానికి చర్యలు చేపడతామని ఆయన హామీ ఇచ్చారు. ఆయన వెంట స్థానిక నాయకులు వంగలపూడి గోపి, జి.రామాంజనేయులు, యు.ప్రవీణ్, పి.అప్పారావు, ఎం.ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

ఆటోలో మరిచిపోయిన బ్యాగ్‌ను బాధితులకు అప్పగించిన పోలీసులు

గోపాలపట్నం, సెప్టెంబరు 12: ఆటోలో మరిచిపోయిన బ్యాగును పోలీసులు వెతికిపట్టుకుని ఫిర్యాదుదారులకు అప్పగించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీకాకుళం జిల్లా పలాసకు చెందిన జి.రాజారావు అనే వ్యక్తి సింహాద్రి అప్పన్న స్వామిని దర్శించుకునేందుకు కుటుంబ సభ్యులతో కలిసి గురువారం ఉదయం రైలులో గోపాలపట్నం వచ్చారు. సింహాచలం రైల్వే స్టేషన్ కూడలిలో ఓ షేర్ ఆటోలో సింహాచలం వెళ్లారు. అయితే రాజారావు కుటుంబ సభ్యులు ఆటోలో తమ బ్యాగ్‌ను మరిచిపోయి దిగిపోయారు. కాసేపటి తర్వాత బ్యాగ్ గుర్తుకు రావడంతో వెంటనే పోలీసులకు ఫోన్‌లో సమాచారం అందించారు. వెస్ట్ సీఐ ఎన్.శ్రీనివాసరావు ఆదేశాల మేరకు గోపాలపట్నం క్రైమ్ సిబ్బంది సీసీ ఫుటేజీలను పరిశీలించి సదరు ఆటోను గుర్తించారు. కాగా రాజారావు బ్యాగ్‌లో ఉన్న సెల్ ఫోన్‌కు పలుమార్లు పోలీసులు కాల్ చేయడంతో ఆటోడ్రైవర్ విజయ్‌కుమార్ ఫోన్ ఎత్తి తన వాహనంలో ప్రయాణికులు ఎవరో బ్యాగ్ మరచిపోయినట్టు చెప్పాడు. పోలీసుల సూచన మేరకు ఆ బ్యాగ్‌ను ఆటో డ్రైవర్ స్టేషన్‌లో అప్పగించాడు. అనంతరం ఫిర్యాదుదారునికి పోలీసులు బ్యాగ్‌ను అప్పగించారు. కాగా బ్యాగ్‌లో రూ.10 వేల నగదు, సెల్ ఫోన్‌ను సురక్షితంగా ఉన్నట్టు రాజారావు తెలిపారు. ఫిర్యాదు చేసిన కొన్ని గంటల వ్యవధిలోనే బాధితునికి పోగొట్టుకున్న బ్యాగును అప్పగించడంలో ప్రతిభ కనబరిచిన స్టేషన్ సిబ్బంది గోవిందమ్మ, రవిబాబు, బాలాజీ, సుధాకర్, రమేశ్‌లను సీఐ అభినందించారు.



బాధితులకు బ్యాగ్‌ను అందజేస్తున్న కానిస్టేబుల్

నేటి నుంచి సింహాచలంలో పవిత్రోత్సవాలు

సింహాచలం, సెప్టెంబరు 12: వరాహలక్ష్మీనృసింహస్వామి ఆలయంలో జరిగే నిత్య, వార, పక్ష, మాస, వార్షిక ఉత్సవాల్లో వైదిక సిబ్బంది, అధికారులు చేసే దోషాల నివృత్తికి శుక్రవారం నుంచి తిరు పవిత్రోత్సవాలు నిర్వహించనున్నట్టు ఆలయ స్థానాచార్యులు రాజగోపాల్ తెలిపారు. ఏడాది పొడవునా జరిగిన పలు ఉత్సవాల్లో మంత్రం, క్రియ, ద్రవ్యం, భక్తి, శ్రద్ధ విధానాల్లో జరిగిన దోషాల నివృత్తికి ఏటా భాద్రపద మాస శుక్లపక్ష దశమి నుంచి ఐదు రోజులు తిరుపవిత్రోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. ఈమేరకు దశమి రోజున అంకురార్పణతో ఉత్సవాలకు శ్రీకారం చుట్టి, పవిత్రాధివాసం, పవిత్ర సమర్పణ, పవిత్ర విసర్జన, ఏకాంత స్నపన తిరుమంజాలను నిర్వహిస్తామన్నారు. ప్రత్యేక హోమాలను ఉభయ సంధ్యలను, చతుర్వేద, ఇతిహాస, పురాణాల పారాయణలు నిర్వహించి త్రయోదశి రోజున మహా పూర్ణాహుతి జరుపుతామన్నారు. కాగా ఉత్సవాలను పురస్కరించుకుని ఈనెల 14 నుంచి 17 వరకు స్వామివారి ఆర్జిత సేవలను రద్దు చేశామని, రాత్రి 7 గంటల వరకే భక్తులకు దర్శనాలు లభిస్తాయని అధికారులు ప్రకటించారు.

పులగాలిపాలెంలో ఆక్రమణల తొలగింపు

పెందుర్తి, సెప్టెంబరు 12: పెందుర్తిలోని పులగాలిపాలెం రోడ్డులో సర్వే నంబరు 260/1 ప్రభుత్వ స్థలంలో ఆక్రమణలను గురువారం రెవెన్యూ సిబ్బంది తొలగించారు. ఇక్కడి గెడ్డ పోరంబోకు స్థలంలో అక్రమంగా నిర్మించిన ప్రహరీ, పునాదులను ఎక్స్‌కవేటర్ సాయంతో కూల్చివేశారు. తహసీల్దార్ వేణుగోపాల్ ఆదేశాల మేరకు చర్యలు తీసుకున్నారు.

15న సరిపల్లిలో వైద్య శిబిరం

పెందుర్తి, సెప్టెంబరు 12: గీతం ఆస్పత్రి ఆధ్వర్యంలో సరిపల్లి ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ఈ నెల 15న ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నారు. వైద్య పరీక్షలతో పాటు దంత సమస్యలపై పరీక్షలు చేసి, ఉచితంగా మందులు పంపిణీ చేయనున్నారు.

జిల్లాను దేశంలో నంబర్‌వన్‌గా నిలపాలి

- ఉపాధి, ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేయాలి
- కేంద్ర పథకాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలి
- జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ సమావేశంలో ఎంపీ శ్రీభరత్

విశాఖపట్నం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): సమ్మిళిత అభివృద్ధి విధానాలను అవలంబిస్తూ ఉపాధి, ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేసి, జిల్లాను దేశంలోనే నంబర్‌వన్ స్థానంలో నిలబెట్టాలని ఎంపీ ఎం.శ్రీభరత్ పిలుపునిచ్చారు. ఇందుకోసం ప్రజా ప్రతినిధులు, అధికారులు విశేష కృషి చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన, ప్రయోజనాలపై విస్తృత ప్రచారం చేయాలని కోరారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో గురువారం నిర్వహించిన జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ (దిశా) సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ రాష్ట్రంలో అమలవుతున్న కేంద్ర ప్రాయోజిత పథకాలు, సమస్యలు, సవాళ్లపై అధికారులకు దిశా నిర్దేశం చేశారు. జిల్లాలో 29 శాఖల పరిధిలో ఉపాధి హామీ, ప్రధానమంత్రి ఆవాస్ యోజన, దీనదయాల్ అంత్యోదయ యోజన, ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన, డిజిటల్ ఇండియా, నేషనల్ లైవ్ స్టాక్, గోకుల్ మిషన్, ఖేలో ఇండియా, మాతృవందన యోజన, జాతీయ ఆరోగ్య మిషన్, జలజీవన్ మిషన్, పీఎం పోషణ, సంసద్ ఆదర్శ గ్రామ యోజన, పీఎం ఉజ్వల యోజన, పీఎం విశ్వకర్మ వంటి పథకాల అమలులో ఎదురవుతున్న ఇబ్బందులు, ప్రజలకు అందే ప్రయోజనాలపై సమీక్షించారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో వ్యవహరించి పథకాలు ప్రజలకు అందేలా చూడాలన్నారు. విద్యారంగానికి పెద్దపీట వేయాలని, ఉపాధి కల్పన కోసం యువతకు నైపుణ్యంలో కూడిన శిక్షణ ఇవ్వాలన్నారు. సోలార్ వినియోగం పెరిగేలా అవగాహన కల్పించాలన్నారు. మేహాద్రిగెడ్డ, గంభీరం రిజర్వాయర్ల నిర్వహణలో సమన్వయం లోపం తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని, పూడిక తొలగింపునకు ప్రణాళికలు రూపొందించాలన్నారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో 170 భవనాల నిర్మాణాలపై నివేదిక ఇవ్వాలని సూచించారు. కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర్ ప్రసాద్ జిల్లాలో కేంద్ర పథకాల అమలు తీరును వివరించారు. సమీక్షలో ఎమ్మెల్యేలు వెలగపూడి రామకృష్ణబాబు, పి.గణబాబు, పంచకర్ల రమేష్‌బాబు, పల్లా శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు పలు అంశాలపై ప్రశ్నలు వేశారు. మేయర్ గొలగాని హరివెంకటకుమారి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీ, డీఆర్వో కె.మోహన్‌కుమార్, జడ్పీ సీఈవో సత్యనారాయణ, పాల్గొన్నారు.

అరకొర సమాచారంతో వస్తే ఎలా?

సమావేశంలో ఎంపీతోపాటు ఎమ్మెల్యేలు లేవనెత్తిన అంశాలపై కొందరు అధికారులు నీళ్లు నమలడంతో వారిని మందలించారు. డ్వామా, డీఆర్‌డీఏ, వైద్య ఆరోగ్యశాఖ, హౌసింగ్ శాఖల అధికారుల తీరుపై ప్రజా ప్రతినిధులు అసంతృప్తి వ్యక్తంచేశారు. హుద్‌హుద్ బాధితులకు కొమ్మాదిలో నిర్మించిన ఇళ్లు పూర్తిచేయకపోవడం, ఇళ్ల కేటాయింపులో జాప్యంపై పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు అసంతృప్తి వ్యక్తంచేశారు. దాతల సాయంతో నిర్మించిన ఇళ్ల కేటాయింపుపై విచారణ చేయాలని తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు డిమాండ్ చేశారు. ఉపాధి హామీ అమలుపై పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు పలు సందేహాలు వ్యక్తంచేస్తూ సమావేశానికి ముందుగా ఎజెండా ఇవ్వాలన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

అక్కయ్యపాలెం/ సీతమ్మధార, సెప్టెంబరు 12: నిర్వహణ పనుల నేపథ్యంలో శుక్రవారం నరసింహనగర్, రైతుబజార్, ఆకాష్ జూనియర్ కళాశాల ప్రాంతాల్లో ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు జోన్-1 ఈఈ బి.సింహాచలంనాయుడు తెలిపారు. సీతమ్మధార టీపీటీ కాలనీ, హిల్ వ్యూ పార్క్, రాకెట్ పార్క్, ఏఎస్ఆర్ నగర్, వాల్వో ఆఫీస్, సబ్బంహరి ఇంటి ప్రాంతం, క్షత్రియ కళ్యాణ మండపం, అల్లూరి సీతారామరాజు విగ్రహం పరిసర ప్రాంతాల్లో సరఫరా ఉండదన్నారు.

12 కిలోల గంజాయి పట్టివేత

విశాఖపట్నం, సెప్టెంబరు 12: గంజాయి రవాణా చేస్తున్న ఇద్దరిని రైల్వే పోలీసులు పట్టుకుని రూ.60,500 విలువ చేసే 12.1 కిలోల గంజాయి బ్యాగ్‌లను స్వాధీనం చేసుకున్నారు. ప్రత్యేక బృందం రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫామ్‌లపై తనిఖీలు చేస్తున్న సమయంలో కోరాపుట్‌కు చెందిన షాను ఖడా, మంగరాజ్ ఖడా నిందితులు గుర్తు తెలియని వ్యక్తులకు గంజాయి బ్యాగ్‌లను అందిస్తుండగా దాడిచేసి పట్టుకున్నామని పోలీసులు ప్రకటనలో తెలిపారు. నిందితులను అరెస్టు చేసి, కోర్టులో హాజరుపరిచామన్నారు.

తాగునీటి కోసం రోడ్డెక్కిన మహిళలు

- పూర్ణామార్కెట్ పెరికివీధి వద్ద ఉద్రిక్తత



బిందెలతో నిరసన తెలుపుతున్న పెరికివీధి మహిళలు

జగదాంబ కూడలి, సెప్టెంబరు 12: ఖాళీ బిందెలతో మహిళలు రోడ్డెక్కి ఆందోళనకు దిగారు. మెయిన్ రోడ్డు గుండా వాహన రాకపోకలను మహిళలు అడ్డుకున్నారు. దీంతో పూర్ణామార్కెట్ పెరికివీధి రామాలయం వద్ద గురువారం ఉదయం ఉద్రిక్తత చోటుచేసుకుంది. కుళాయి ద్వారా నీటి సరఫరా నిలిపివేయడం పట్ల పెరికివీధి, స్ప్రింగ్ రోడ్డు ప్రాంతాల మహిళలు, స్థానిక నివాసీయులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండు మూడు గంటల పాటు మహిళలు ఆందోళనకు దిగడంతో వాహనరాకపోకలు పూర్తిగా స్తంభించిపోయాయి. అధికారులు, ప్రజా ప్రతినిధుల తీరును ఎండగట్టారు. ఆందోళన తీవ్రరూపం దాల్చడంతో నీటి సరఫరా విభాగం అధికారులు, కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు అక్కడకు వచ్చి మహిళలను శాంతపరిచే ప్రయత్నం చేశారు. శుక్రవారం ఈ రెండు ప్రాంతాలకు ఎక్కువ సమయం నీరు సరఫరా చేస్తామని హామీ ఇచ్చారు. రెండు, మూడు రోజులుగా పాతనగరంలోనూ ఇదే పరిస్థితి నెలకొనడం గమనార్హం, పాత నగరంలో నివాసీయులు పూర్తిగా కుళాయి నీటి మీద ఆధారపడడం, జీవీఎంసీ నీటి సరఫరాలో ఇబ్బందులు ఎదురవ్వడంతో మహిళలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. బిందెడు నీటి కోసం నిరీక్షించాల్సి వస్తోందని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఎయిర్‌పోర్ట్ ఎస్‌ఐగా సీహెచ్ ప్రసాద్

మర్రిపాలెం: ఎయిర్‌పోర్ట్ పోలీస్‌స్టేషన్ ఎస్‌ఐగా సీహెచ్ ప్రసాద్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. పార్వతీపురం మన్యం జిల్లా బత్తిలి నుంచి వచ్చారు. అసాంఘిక కార్యకలాపాలను అరికట్టేందుకు చర్యలు చేపడతామన్నారు.

వ్యభిచారం గుట్టు రట్టు

మర్రిపాలెం, సెప్టెంబరు 12: గ్రేటర్ పరిధి 52వ వార్డు కరాసలో ఇల్లు అద్దెకు తీసుకొని మూడు నెలలుగా వ్యభిచారం నిర్వహిస్తున్నట్టు అందిన సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్, విమానాశ్రయ పోలీసులు గురువారం దాడి చేశారు. ముగ్గురు నిర్వాహకులు, ఐదుగురు మహిళలు, ఇద్దరు విటులను పట్టుకున్నారు.

ఎస్సీల కులగణన చేపట్టాలి

సీతంపేట, సెప్టెంబరు 12: మాలలకు న్యాయం చేయాలని, ఎస్సీ కులగణన చేపట్టాలని డాక్టర్ అంబేడ్కర్ గ్లోబల్ మిషన్ అధ్యక్షుడు బయ్యే మల్లయ్య ప్రభుత్వాన్ని కోరారు. పౌరగ్రంథాలయంలో గురువారం మాట్లాడుతూ రివ్యూ పిటిషన్‌ను సుప్రీంకోర్టు ఆమోదించినందున తీర్పు వచ్చే వరకు వేచి చూడాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సువర్ణ రత్నం, దాసరి పుల్లారావు, ఎస్.మోహన్‌బాబు, బొత్స రామసూర్య ఎం.ఎ. రాజు, రేబాక మధు, కె.అనిల్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

నేవల్ క్విజ్ పోటీల్లో పల్లవి, కిరణ్మయి ప్రతిభ

విశాఖపట్నం, సెప్టెంబరు 12: ఎన్‌సీసీ క్యాడెట్లకు నేవల్ మెడికల్ యూనిట్ నిర్వహించిన క్విజ్ పోటీల్లో విశాఖ ప్రభుత్వ మహిళ కాలేజీ ఎన్‌సీసీ క్యాడెట్లు సీహెచ్ లక్ష్మీ పల్లవి, ఎస్.కిరణ్మయి కాంస్య పతకం దక్కించుకున్నారు. ఈ సందర్భంగా గురువారం ప్రభుత్వ మహిళ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.మంజుల వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సీసీ ఆఫీసర్ లెఫ్టినెంట్ డాక్టర్ కె.గీతాంజలి, పీడీ డాక్టర్ ఆర్.కిరణ్మయి, ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ డాక్టర్ బి.సంతోషి, అనూష పాల్గొన్నారు.

ముస్లింల సమస్యలు పరిష్కరిస్తా: ఎంపీ శ్రీభరత్



ఎంపీకు వినతి పత్రం అందిస్తున్న మసీద్ కమిటీ సభ్యులు

జగదాంబ కూడలి/మహారాణిపేట, సెప్టెంబరు 12: ముస్లింల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఈ వర్గ ప్రతినిధులకు ఎంపీ శ్రీభరత్ హామీ ఇచ్చారు. గురువారం జగదాంబ వద్ద మసీద్ కమిటీ సభ్యులు, ముస్లిం పెద్దలతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మసీద్ కమిటీ మహారాణిపేట అంగటి దిబ్బ వద్ద సుమారు 8 ఎకరాల తమ స్థలం దురాక్రమణకు గురయ్యిందని, అందుకు బదులుగా వేరొకచోట స్థలం ఇవ్వాలని మహారాణిపేటలోని మక్కా మసీదు అసోసియేషన్ అధ్యక్షుడు అబ్దుల్ మున్నీర్ కోరారు. నగర పరిధిలో వక్ఫ్‌భూముల అన్యాక్రాంతంతో ఇబ్బందులు పడుతున్నామని మరికొందరు ఎంపీ దృష్టికి తెచ్చారు. కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ బోర్డు చట్ట సవరణలకు తీసుకున్న నిర్ణయాల ప్రభావాన్ని పెద్దలు చర్చించారు. మధురవాడ వద్ద ముస్లింలకు స్థలం కేటాయింపు వ్యవహారం దీర్ఘకాలికంగా పరిష్కారం కావడంలేదని మసీద్ కమిటీ ఎంపీ ముందుంచింది. ఈ సందర్భంగా మసీదు కమిటీ సభ్యులు ఎంపీ భరత్‌ను ఘనంగా సన్మానించారు. తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రాన్ని అందించారు. నగరంలోని ముస్లింల సంక్షేమానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర నాయకుడు నజీర్, దక్షిణ టీడీపీ ఇన్‌చార్జ్ సీతంరాజు సుధాకర్, మక్కామసీద్ అధ్యక్షుడు అబ్దుల్ మజీర్, కార్యదర్శి సయ్యద్ అమీర్జాన్, కోశాధికారి మోహుద్దీన్, చిన్నరెహమాన్ తదితరులు పాల్గొన్నారు.

రైళ్లు ఫుల్

... 5వ పేజీ తరువాయి

రైళ్లలో కొన్ని తేదీల్లో బెర్తుల ఖాళీలున్నాయి.

చెన్నై వెళ్లే రైళ్లకు సాధారణ రద్దీ ఏర్పడింది. మెయిల్ (12839), కోరమండల్ (12841), బొకారో (13351) వంటి ప్రతిరోజు నడిచే రైళ్లతోపాటు భువనేశ్వర్-పాండిచ్చేరి (12898), షాలిమార్-త్రివేండ్రం (22642), గువహటి-బెంగళూరు (12510), హౌరా-తిరుచిరాపల్లి (12660), ముజఫర్‌పూర్-యశ్వంతపూర్ (15228), సంత్రాగచ్చి-చెన్నై ఏసీ ఎక్స్‌ప్రెస్ (22807), న్యూజలపాయ్‌గురి-మద్రాసు (22616) వంటి రైళ్లకు సాధారణ రద్దీ నెలకొంది.

సికింద్రాబాద్ రైళ్లకు అందుబాటులో బెర్తులు

సికింద్రాబాద్ వెళ్లే గోదావరి (12727), గరీబ్‌రథ్ (12739), కోణార్క్ (11020), ఫలక్‌నుమా (12703), వందేభారత్ (20833), విశాఖ-నాందేడ్ (20811), ఎల్‌టీటీ ఎక్స్‌ప్రెస్ (18519), దురంతో (22203) వంటి ప్రధాన రైళ్లకు దసరా రోజుల్లో కూడా బెర్తులు లభించే పరిస్థితి ఉంది. ఈ నెల 17వ తేదీ వరకు గోదావరి, గరీబ్‌రథ్, మహబూబ్‌నగర్, వందేభారత్, జన్మభూమి వంటి రైళ్లకు, ఈ నెల 18 నుంచి అక్టోబరు 12వ తేదీ వరకు బెర్తులు అందుబాటులో ఉన్నాయి. అయితే దసరా తర్వాత...అక్టోబరు 13 నుంచి అన్ని ప్రధాన రైళ్లకు డిమాండ్ ఏర్పడింది.

తిరుపతి, శ్రీకాకుళం మధ్య ప్రత్యేక రైళ్లు

విశాఖపట్నం, సెప్టెంబరు 12: దసరా, దీపావళి పండుగల నేపథ్యంలో ప్రయాణికుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని దువ్వాడ మీదుగా తిరుపతి, శ్రీకాకుళం రోడ్డు స్టేషన్ల మధ్య ప్రత్యేక రైళ్లను నడుపుతామని సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. 07447 నంబరు గల రైలు అక్టోబరు 6 నుంచి నవంబరు 10 వరకు ప్రతి ఆదివారం సాయంత్రం 5.10 గంటలకు తిరుపతిలో బయలుదేరి మరుసటిరోజు ఉదయం 7.55 గంటలకు దువ్వాడ, మధ్యాహ్నం 12.15 గంటలకు శ్రీకాకుళం రోడ్డు చేరుతుంది. తిరుగు ప్రయాణంలో 07448 నంబరు గల రైలు అక్టోబరు 7 నుంచి నవంబరు 1 వరకు ప్రతి సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు శ్రీకాకుళం రోడ్డు నుంచి బయలుదేరి సాయంత్రం 6.02 గంటలకు దువ్వాడ, మరుసటిరోజు ఉదయం 8.20 గంటలకు తిరుపతి చేరుతుంది.

నేడు జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సమావేశం

విశాఖపట్నం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సమావేశం శుక్రవారం జరగనున్నది. మేయర్ గొలగాని హరివెంకటకుమారి అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో చర్చించేందుకు 280 అంశాలతో ఎజెండాను తయారుచేశారు. కొత్త కమిటీ ఎన్నికైన తర్వాత తొలి సమావేశం కావడంతో ప్రాధాన్యం సంతరించుకుంది. సాధారణంగా స్టాండింగ్ కమిటీ సమావేశానికి 50 అంశాలకు మించకుండా ఎజెండా తయారుచేస్తుంటారు. కానీ ఈ సమావేశానికి 280 అంశాలతో ఎజెండా తయారుచేయడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇంతవరకూ స్టాండింగ్ కమిటీ సమావేశాలన్నీ ఉదయం 11 నుంచి మధ్యాహ్నం రెండు గంటలు వరకు జరిగాయి. మూడు గంటల్లో 280 అంశాలను చర్చించి, ఆమోదంపై నిర్ణయం తెలపడం ఎలా సాధ్యమనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. కమిటీలోని కొందరు సభ్యులు, అధికారులు కొన్ని అంశాల విషయంలో ఇప్పటికే ఒక నిర్ణయానికి వచ్చేశారని, వాటిని మాత్రమే ఆమోదించి, మిగిలిన అంశాలను వాయిదా వేసే అవకాశం ఉందంటున్నారు. తాజా ఎజెండాలోని అంశాలన్నీ వైసీపీ ప్రభుత్వ హయాంలో చేసిన పనులకు సంబంధించినవి కావడంతో సభ్యులు ఎలాంటి నిర్ణయం తీసుకుంటారనేది వేచిచూడాలి.

లక్ష్మీ వినాయక ఆలయంలో విద్యా గణపతి అవతారం



విద్యాగణపతిగా లక్ష్మీ వినాయకుడు, మురళీనగర్ గణపతికి గరిక పూజ

జాతీయ రహదారి తాటిచెట్లపాలెం వద్ద గల ఆంధ్రజ్యోతి కార్యాలయం సమీపంలో ఉన్న లక్ష్మీ వినాయక ఆలయంలో గణనాథుడు గురువారం విద్యాగణపతిగా దర్శనమిచ్చాడు. కాగా మురళీనగర్ బృందావన్ పార్క్ సమీపంలో కొలువుదీరిన గణపతికి గురువారం గరిక పూజను ఘనంగా నిర్వహించారు. **- మురళీనగర్**

రూ.1,11,006 పలికిన దుర్గా గణపతి లడ్డూ

సీతంపేట, సెప్టెంబరు 12: సీతంపేట దుర్గాగణపతి ఆలయంలో నిర్వహిస్తున్న నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన 99 కిలోల లడ్డూను ఉత్సవ కమిటీ సారిపిల్లి గోవింద్ ఆధ్వర్యంలో గురువారం వేలం వేశారు. స్టీల్ సిటీ సెక్యూరిటీస్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ సతీష్‌కుమార్ ఆర్య స్వామి లడ్డూను రూ.1,11,006కు దక్కించుకున్నారు. దీనిని భక్తులకు ప్రసాదంగా అందిస్తామని ఆయన తెలిపారు.

అదృశ్యమైన ఫార్మా ఉద్యోగి మృతి

- 'అడ్మిరాన్' పరిశ్రమ మిథనాల్ ట్యాంక్‌లో శవమై తేలిన సూర్యనారాయణ



సూర్యనారాయణ (ఫైల్)

పరవాడ, సెప్టెంబరు 12: ఫార్మాసిటీలోని అడ్మిరాన్ లైఫ్ సైన్సెస్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమలో మంగళవారం అదృశ్యమైన ఆర్.సూర్యనారాయణ(40) పరిశ్రమ ఆవరణలోని మిథనాల్ ట్యాంక్‌లో శవమై తేలాడు. ఈ విషయాన్ని గురువారం ఉదయం యాజమాన్యం గుర్తించింది. పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు.పరిశ్రమలో ప్రొడక్షన్ మేనేజర్‌గా పనిచేస్తున్న ఆర్.సూర్యనారాయణ మంగళవారం జనరల్ షిఫ్టుకు హాజరయ్యాడు. సాయంత్రం ఇంటికి రాకపోవడంతో కుటుంబీకులు వాకబు చేశారు. ఆచూకీ లభించలేదు. దీంతో పరవాడ పోలీసులకు ఫిర్యాదు చేశారు. గురువారం పరిశ్రమలో గాలింపు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో మిథనాల్ ట్యాంకు పైకి ఎక్కి చూడగా అందులో సూర్యనారాయణ మృతదేహం కనిపించింది. అగ్నిమాపక సిబ్బంది ట్యాంకులోకి నీరు నింపి, మృతదేహాన్ని పైకి తేలేలా చేసి బయటకు తీశారు.

మృతుడి కుటుంబసభ్యుల ఆందోళన

యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగానే సూర్యనారాయణ ప్రాణాలు కోల్పోయాడని, రూ.కోటి నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ కుటుంబసభ్యులు, బంధువులు పరిశ్రమ ప్రధాన ద్వారం వద్ద గురువారం ఆందోళనకు దిగారు. మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించేందుకు సిద్ధమవుతుండగా అడ్డుకున్నారు. దీనిపై జడ్పీటీసీ సభ్యుడు పైలా సన్యాసిరాజు, మాజీ ఎంపీపీలు పైలా జగన్నాథరావు, మాదంశెట్టి నీలబాబు, టీడీపీ నేతలు యాజమాన్యంతో చర్చలు జరిపారు. రూ.50 లక్షలు నష్టపరిహారంతోపాటు దహన సంస్కారాలకు మరో లక్ష రూపాయలు ఇచ్చేందుకు యాజమాన్యం అంగీకరించింది. అనంతరం సూర్యనారాయణ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. సూర్యనారాయణకు భార్య బాల పరమేశ్వరి, కుమార్తె జ్యోషిత, కుమారుడు సృజన్ ఉన్నారు. ఇతని స్వస్థలం విజయనగరం జిల్లా వేపాడ మండలం వీలుపర్తి గ్రామం.

'మెడ్‌టెక్‌ను ప్రభుత్వమే నిర్వహించాలి'

మురళీనగర్, సెప్టెంబరు 12: ప్రతిష్ఠాత్మకమైన మెడ్‌టెక్ విశ్వవిద్యాలయాన్ని ప్రభుత్వ రంగంలోనే నిర్వహించాలని రాష్ట్ర కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ, మూల వెంకటరావు సూచించారు.పెదగంట్యాడ వద్ద గ్రీన్ ఫీల్డ్ గ్లోబల్ విశ్వవిద్యాలయంలో 2025-26 నుంచి తరగతులు ప్రారంభించాలనే ప్రణాళిక మంచిదేనన్న ఆయన ప్రైవేటు, ప్రభుత్వ భాగస్వామ్యంతో నిర్వహించాలన్న ఆలోచన ఆందోళనకరమన్నారు. అత్యంత ఖరీదైన కోర్సులు సామాన్యులు, వెనుకబడిన తరగతుల విద్యార్థులకు దూరమవుతాయన్నారు. మెడ్‌టెక్‌లో పరిశోధన, శిక్షణ, ఉద్యోగాలు సామాన్యులకు దక్కాలంటే ప్రభుత్వమే నిర్వహించాలని వెంకటరావు కోరారు.

కనకమహాలక్ష్మి ఆలయంలో పవిత్రోత్సవాలకు శ్రీకారం

పూర్ణామార్కెట్, సెప్టెంబరు 12: వన్‌టౌన్ కనక మహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో శుక్రవారం నుంచి పవిత్రోత్సవాలు నిర్వహించేందుకు అధికారులు సన్నాహాలు పూర్తిచేశారు. గురువారం ఈవో శ్రీనివాసుల రెడ్డి, వేదపండితులు, అర్చకులతో ప్రత్యేకంగా సమీక్షించారు. శుక్రవారం సాయంత్రం 5.30 గంటలకు పవిత్రోత్సవాలు ప్రారంభమవుతాయి. 16 వరకు నిర్విరామంగా జరిపేందుకు నిర్ణయించారు.

ఎర్నిమాంబ ఆలయానికి రూ.19 లక్షల ఆదాయం

జ్ఞానాపురం, సెప్టెంబరు 12: అచ్చియ్యమ్మపేట గ్రామదేవత ఎర్నిమాంబ అమ్మవారి ఆలయం హుండీ లెక్కింపు గురువారం చేపట్టారు. దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ బి.వసంతకుమార్ పర్యవేక్షణలో గోపాలపట్నం శ్రీహరి సేవా సంఘం సహకారంతో లెక్కించగా జులై 10 నుంచి సెప్టెంబరు 12 వరకు రూ.19,09,917 ఆదాయం వచ్చినట్లు ఈవో డీవీఎస్ సురేష్ బాబా తెలిపారు.

ఏచూరి మృతికి సీపీఐ సంతాపం

అల్లిపురం, సెప్టెంబరు 12: భారత కమ్యూనిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మృతి పట్ల సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జె.వి.సత్యనారాయణమూర్తి, రాష్ట్ర సమితి సభ్యుడు సీహెచ్ రాఘవేంద్రరావు, జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు సంతాపం తెలిపారు. రాజకీయాలకు అతీతంగా గుర్తింపు తెచ్చుకున్న నేత ఏచూరి అని, ఆయన మరణం దేశ రాజకీయాలకు ముఖ్యంగా వామపక్ష ఉద్యమాకి తీరని లోటని వారు అన్నారు.

డాబాగార్డెన్స్: సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి జీవితం ఆదర్శమైనదని జీవీఎంసీ కాంట్రాక్టు వర్కర్స్ లేబర్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు ఎం.ఆనందరావు అన్నారు. కార్యకర్తల కోసం పరితపించే వ్యక్తి ఏచూరి అని శ్లాఘించారు. ఆయన మృతి దేశానికే తీరని లోటన్నారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నామన్నారు.

జాతీయ సీనియర్ ఆక్వాటిక్ టోర్నీలో సంపత్‌కుమార్‌కు కాంస్యం



సంపత్‌కుమార్ యాదవ్‌తో మోహన్ వెంకటరామ్

విశాఖపట్నం (స్పోర్ట్సు), సెప్టెంబరు 12: కర్ణాటకలోని మంగళూరులో జరుగుతున్న జాతీయ సీనియర్ ఆక్వాటిక్ చాంపియన్‌షిప్ టోర్నీలో విశాఖకు చెందిన జి.సంపత్‌కుమార్ యాదవ్ అద్భుత ప్రతిభ కనబరిచాడు. బుధవారం రాత్రి నిర్వహించిన 800 మీటర్ల ఫ్రీ స్టైల్ ఈవెంట్‌లో కాంస్య పతకం సాధించాడు. సంపత్‌కుమార్ యాదవ్...800 మీటర్ల రేస్‌ను 8:28:35 నిమిషాల్లో పూర్తి చేసి పతకం దక్కించుకున్నాడు. దాదాపు 32 ఏళ్ల తర్వాత జాతీయ స్విమ్మింగ్ టోర్నీలో పురుషుల కేటగిరీలో ఆంధ్రప్రదేశ్‌కు పతకం అందించిన ఘనతను సొంతం చేసుకున్నాడు. అరుదైన ఘనత సాధించిన సంపత్‌కుమార్‌ను ఆంధ్రప్రదేశ్ స్విమ్మింగ్ సంఘం ప్రధాన కార్యదర్శి మోహన్ వెంకటరామ్, ఇతర ప్రతినిధులు, సీనియర్ స్విమ్మర్లు, కోచ్‌లు అభినందించారు.

రక్షణ కల్పించండి

- సీపీని వేడుకున్న ఎన్ఆర్ఐ దంపతులు



సీపీ కార్యాలయం వద్ద ఎన్ఆర్ఐ దంపతులు

మహారాణిపేట, సెప్టెంబరు 12: సొంత స్థలాన్ని ఆక్రమించుకోవడమే కాకుండా, దాడికి తెగబడ్డారని, ప్రాణాలు అరచేత పట్టుకుని బతికిబయటపడ్డామని, రక్షణ కల్పించాలని ఎన్ఆర్ఐ దంపతులు గురువారం నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీని వేడుకున్నారు. వారు తెలిపిన వివరాల మేరకు... ఎన్ఆర్ఐ దంపతులు చిరికి నాయుడు, వెంకటపద్మ పెందుర్తి సమీపంలోని సింహపురి కాలనీ మైత్రీనగర్ లే అవుట్‌లో సుమారు 466 గజాల స్థలాన్ని 2004లో కొనుగోలు చేశారు. వారు విదేశాల్లో ఉన్నప్పటికీ 2014 వరకు ఆ స్థలం వారి అధీనంలోనే ఉంది. అయితే దీనిపై కన్నేసిన రౌడీ షీటర్లు డుంబూరి ప్రభాకర్, డీపీ మహేశ్ అనుచరులు స్థలాన్ని కబ్జా చేశారు. ఈ నేపథ్యంలో ఎన్ఆర్ఐ దంపతులు కోర్టును ఆశ్రయించారు. దీనిపై ఇటీవల కోర్టు ఆ స్థలం ఎన్ఆర్ఐ దంపతులదేనని తీర్పునిచ్చింది. ఈ నేపథ్యంలో గురువారం ఆ స్థలంలో పనులు చేపడుతుండగా సుమారు 20 మందికి పైగా వచ్చి, తమపై దాడి చేశారని, పోలీసులకు ఫిర్యాదు చేయకుండా తమవద్ద ఉన్న సెల్‌ఫోన్లు లాక్కుని, రక్తం వచ్చేలా కొట్టారని, దేవుడి దయతో ప్రాణాలతో బయటపడ్డామని వాపోయారు. తమ ప్రాణాలకు రక్షణ కల్పించి, స్థలం విషయంలో న్యాయం చేయాలని సీపీ శంఖబ్రత బాగ్చీని వేడుకున్నారు.

రౌడీషీటర్లు జిల్లా విడిచి పారిపోవాలి: సీపీ

ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ నగరంలో రౌడీ షీటర్లకు రెండే మార్గాలున్నాయన్నారు. ఉంటే జైల్లో ఉండాలని, లేదంటే ఎలాంటి వివాదాల జోలికి వెళ్లకుండా సన్మార్గంలో నడుచుకోవాలన్నారు. నేరాలు చేస్తామంటే పీడీ యాక్ట్ అమలు చేసి, కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అలాంటి ఆలోచన ఉన్న రౌడీషీటర్లంతా జిల్లా విడిచి పారిపోవాలని హెచ్చరించారు.

భక్తి ముసుగులో వ్యాపారం

... 5వ పేజీ తరువాయి

చేసుకుంటున్నారు. దర్శనానికి టికెట్లు పెట్టారు. వ్యాపారాలకు స్టాళ్లు అద్దెకు ఇచ్చారు. సింధియాలో ప్రత్యేకంగా ఈసారి బెల్లం వినాయకుడి విగ్రహం ఏర్పాటుచేశారు. బెల్లం తయారీకి ఫేమస్ అయిన అనకాపల్లి కూతవేటు దూరంలో ఉండగా, ఆ బెల్లం కాకుండా రాజస్థాన్ నుంచి తెప్పించిన 20 టన్నుల బెల్లాన్ని ఉపయోగించామని చెబుతున్నారు. సుమారు 75 అడుగుల ఎత్తున విగ్రహం ఏర్పాటుచేశారు. స్వామిని దర్శించుకోవడానికి టికెట్ పెట్టారు. జాతరలా వ్యాపారాలకు అనుమతి ఇచ్చారు. వ్యాపారం కోసం 21 రోజులు నిర్వహిస్తున్నారు.

వీటికి ఏ తరహా అనుమతులు ఇచ్చారో..?

చిన్న మండపం పెట్టి పూజలు చేసినా అనుమతి తీసుకోవాలని పోలీసులు నిబంధన పెట్టారు. మరి ఎంవీపీ కాలనీ, గాజువాక, సింధియాల్లో భారీఎత్తున 21 రోజుల పాటు నిర్వహిస్తుంటే పోలీసులు ఎలా అనుమతి ఇచ్చారనేది అనుమానంగా ఉంది. రాజకీయ నాయకులు ప్రోత్సహించడం వల్ల పోలీసులు అడ్డు చెప్పలేకపోతున్నట్టు తెలిసింది. అయితే వ్యాపారంలా చేయడమే అభ్యంతరకరం. ఊహించని ప్రమాదాలు జరగక ముందే వీటిని ఎంత వేగంగా నిమజ్జనం చేస్తే అంత మంచిది. దేశంలో ముంబై తరువాత అంత ప్రాముఖ్యత కలిగిన హైదరాబాద్ (ఖైరతాబాద్) వినాయకుడిని కూడా తొమ్మిది రోజుల తరువాత నిమజ్జనం చేస్తారు. ఇక్కడ కూడా అదే తరహా విధానం పాటించాలి.

జీవీఎంసీలోకి 64 పంచాయతీలు

... 5వ పేజీ తరువాయి

మండలంలో 16 పంచాయతీల ప్రజా ప్రతినిధుల అభిప్రాయాలు కూడా తీసుకున్నామన్నారు. రెండు లక్షల జనాభా, 1.25 లక్షల ఓటర్లు కలిగిన ఈ ప్రాంతాల్లో విలీనం తరువాత పదేళ్లపాటు పన్నులు పెరగకుండా మినహాయింపు తీసుకుంటామన్నారు. టీడీపీ హయాంలోనే 2017లో కాపులుప్పాడ, చేపలుప్పాడ పంచాయతీలు జీవీఎంసీలో విలీనమయ్యాయన్నారు. మధురవాడ, భీమిలి జీవీఎంసీలో ఉంటూ మధ్యలో ప్రాంతాలు పంచాయతీలుగా ఉండడం వల్ల పరిపాలనాపరమైన ఇబ్బందులు వస్తున్నాయన్నారు. విలీనం తరువాత ఏడాదిన్నరపాటు ఎన్ఆర్ఈజీఎస్ ఉపాధి హామీ పనులు చేసుకునే అవకాశం ఉందన్నారు. భోగాపురం విమానాశ్రయంతో సమాంతరంగా ఎలివేటెడ్ కారిడార్లు, ఫ్లైఓవర్ బ్రిడ్జిలు, మెట్రో రైలు పనులు చేపట్టేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నారన్నారు. ఇందుకు అనుగుణంగా భీమిలిలో మెయిన్ రోడ్డు, బీచ్ రోడ్డు, లక్ష్మీనరసింహస్వామి ఆలయం రోడ్డు విస్తరిస్తున్నామని చెప్పారు.

సాయిరెడ్డి నిర్మాణాల కూల్చివేత ఆరంభమే

భీమిలి బీచ్‌లో ఎంపీ విజయసాయిరెడ్డి కుమార్తె నేహారెడ్డి చేపట్టిన నిర్మాణాల కూల్చివేతపై విలేకరులు ప్రశ్నించగా, ఇది ఆరంభం మాత్రమేనన్నారు. వైసీపీ పెద్దలు బెదిరించి భూములు రాయించుకున్నారని, వీటిని వైజాగ్ ఫైల్స్ పేరుతో బయట పెడతామని చెప్పారు. విజయవాడలో వరద బాధితులకు సహాయక కార్యక్రమాలు చేపట్టడానికి చంద్రబాబునాయుడు 11 రోజులు కలెక్టరేట్‌లోనే ఉండి పనులు పర్యవేక్షించారని, ఆయన రోల్‌మోడల్ సీఎం అని ప్రశంసించారు. వరద బాధితులు కష్టాల్లో ఉంటే జైల్లో ఉన్న అనుచరుడిని చూడడానికి వైసీపీ అధ్యక్షుడు జగన్ మోహన్ రెడ్డి వెళ్లారని, ప్రజలంతా దీనిని గమనిస్తున్నారన్నారు. విపత్తును కూడా రాజకీయం చేసిన కుసంస్కారి జగన్ అని విమర్శించారు. ఈ సమావేశంలో జనసేన నాయకుడు పంచకర్ల సందీప్, మాజీ ఎమ్మెల్యే అప్పలనాయుడు, కార్పొరేటర్లు గాడు చిన్నికుమారి, లొడగల అప్పారావు పాల్గొన్నారు.



విద్యా గణపతిగా సంపత్ వినాయగర్

సిరిపురం, సెప్టెంబరు 12 : సిరిపురంలోని సంపత్ వినాయగర్ ఆలయంలో జరుగుతున్న నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా స్వామివారు విద్యా గణపతిగా భక్తులకు గురువారం దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఉదయం ఐదు నుంచి స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయ ఆవరణలో అన్నసమారాధన ఏర్పాటు చేశారు. సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా ఆధ్యాత్మిక ప్రసంగాలు, నాదస్వర కచేరి, స్వామివారి విశిష్టతను తెలియజేసే కార్యక్రమాలు జరిపారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఈవో కె. శిరీష, ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ చోళన్, జి. గోవిందరెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

అప్పన్నకు పసిడి కుసుమార్చన



సింహాచలం, సెప్టెంబరు 12 : వరాహలక్ష్మీనృసింహ స్వామికి ఆర్జిత సేవల్లో భాగంగా గురువారం పసిడి కుసుమార్చన నిర్వహించారు. వేకువజామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తి చేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని భూనీలాదేవి సమేతంగా స్వర్ణాభరణాలతో శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. ఆలయ పద్మనిధి నుంచి పసిడి కుసుమాలు బయటకు తీసి భక్తులతో స్పృశింపజేశారు. అనంతరం భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. నృసింహ అష్టోత్తర శతనామావళి పఠిస్తూ ప్రతి నామానికి ఒక బంగారు పుష్పంతో అర్చన చేశారు. మంత్ర పుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు. తరువాత అదే వేదికపై ఆర్జిత నిత్య కల్యాణం నిర్వహించారు.

నిత్యాన్న ప్రసాద పథకానికి రూ. 2 లక్షల విరాళం

సింహాచలం : వరాహలక్ష్మీనృసింహస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్యాన్న ప్రసాద పథకానికి నగరానికి చెందిన ఇద్దరు దాతలు రూ. లక్ష చొప్పున విరాళం సమర్పించారు. మల్కాపురం ప్రాంతానికి చెందిన కాపు దుర్గేశ్వరరావు రూ.1,00,116లను నగదు రూపంలోనూ, శివాజీపాలెం ప్రాంతానికి చెందిన కోన వసంత లక్ష్మి రూ. లక్షను చెక్ రూపంలోనూ అన్నప్రసాద విభాగం ఇన్‌చార్జి ఏఈఓ పిళ్లా శ్రీనివాసరావుకు గురువారం అందజేశారు. ఆలయ ఆచారం ప్రకారం అధికారులు దాతల కుటుంబ సభ్యులకు స్వామివారి అంతరాలయ దర్శనం కల్పించారు.

త్రీ టౌన్ సీఐగా రమణయ్య

మద్దిలపాలెం, సెప్టెంబరు 12 : నగరంలోని మూడో పట్టణ పోలీస్ స్టేషన్ శాంతిభద్రతల సీఐగా పల్లా రమణయ్య గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన అనకాపల్లి వీఆర్ నుంచి బదిలీపై వచ్చారు. రమణయ్య గతంలో ఎంవీపీ కాలనీ పీఎస్ సీఐగా పనిచేశారు.

చెట్ల కొమ్మలు తొలగింపు

ఆరిలోవ, సెప్టెంబరు 12 : శ్రీకాంత్‌నగర్‌లో రోడ్డు నెంబరు 8లో ఉన్న విద్యుత్ స్తంభానికి అల్లుకుపోయిన చెట్ల కొమ్మలు, తీగెలను ఆ శాఖ సిబ్బంది తొలగించారు. విద్యుత్ స్తంభానికి అల్లుకున్న తీగెలు అన్న శీర్షికన గురువారం 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనానికి వారు స్పందించారు. ఈమేరకు ఏఈ హేమ ఆధ్వర్యంలో సిబ్బంది చెట్ల కొమ్మలను, తీగెలను తొలగించారు.

సినిమా గైడ్

- **వత్తు వదలరా-2 :** మెలోడి, శరత్, శ్రీరామ, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), నటరాజ్ (పెందుర్తి), మినీ మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), గణేష్ (తగరపువలస)
- **భలే ఉన్నాడే :** రమాదేవి, శ్రీకన్య, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), మోహిని (గాజువాక), రాములమ్మ (తగరపువలస)
- **ఎ.ఆర్.ఎం. :** శారద, కామేశ్వరి, సౌజన్య (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక)
- **35 :** కిన్నెర, వెంకటేశ్వర, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం),
- **సరిపోదా శనివారం :** జగదాంబ, సంగం, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), కన్య-1 (గాజువాక), సీతారామయ్య (పరవాడ), తాతా (తగరపువలస)
- **ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్ :** శ్రీరామ, లక్ష్మీకాంత్ (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
- **ఉత్సవం :** శ్రీవెంకటేశ్వర, శ్రీనరసింహ (గోపాలపట్నం), మోహిని (గాజువాక)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 45,టమాటా 30, వంకాయలు (తెలుపు) 46, వంకాయలు (నలుపు) 64, బెండకాయలు 55, పచ్చిమిర్చి 38, కాకరకాయలు 40, బీరకాయలు 50, ఆనపకాయలు 35, కాలీఫ్లవర్ 34, క్యాబేజి 26, క్యారెట్ 36, దొండకాయలు 44, బంగాళదుంపలు 29, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 65, అల్లం (పాతది) 70, బీట్‌రూట్ 32, బరబటి 50, ముల్లంగి 28, నిమ్మకాయలు (కిలో) 105, గోరుచిక్కుడు 34, దోసకాయ 36, వెల్లుల్లి (పెద్దవి) 240, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 110, పొటల్స్ 50, కీరదోస 32, కాప్సికమ్ 70, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 48, చిలగడదుంపలు 54, కంద 54, దేముడు చిక్కుడు 70, కొండఉసిరి 75, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 5, పాలకూర (కట్ట) 5, తోటకూర (కట్ట) 5, మామిడికాయలు 70, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 26, మామిడి అల్లం 70, బొప్పాయి 30, జామకాయలు (కిలో) 60.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	535
విజయనగరం	539
శ్రీకాకుళం	539

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	95
ఫారం ధర	115
విత్ స్కిన్	200
స్కిన్‌లెస్	210

గోస్తనీలో తగ్గని ప్రవాహం

పాండ్రంగి గ్రామానికి రాకపోకలు బంద్

పద్మనాభం, సెప్టెంబరు 12 : పాండ్రంగిలో ఉన్న కాజ్‌వేపై గోస్తనీ నది నీటి ప్రవాహం తగ్గకపోవడంతో ప్రజలకు రాకపోకలు నిలిచిపోయాయి. ఈ గ్రామస్తులు మండల కేంద్రానికి ఇతర గ్రామాలకు వెళ్లాలంటే కాజువే మీదుగా ప్రయాణం చేస్తారు. ప్రస్తుతం నది ప్రవాహం పూర్తిగా తగ్గకపోవడంతో ప్రజల రాకపోకలకు విఘాతం కలుగుతోంది. వారు ఇతర ప్రాంతాలకు వెళ్లడానికి పాండ్రంగి-అలమండ రోడ్డు, పాండ్రంగి-సంగివలస రోడ్డును ఆశ్రయించాల్సి వస్తోంది. తమకు పక్కనున్న గ్రామాలు, మండల కేంద్రాలకు వెళ్లడానికి చుట్టూ తిరిగి 10 నుంచి 15 కిలోమీటర్ల దూరం ప్రయాణించాల్సి వస్తోంది. 20 ఏళ్లుగా పాలకులు పాండ్రంగి వంతెన కోసం ప్రకటనలు చేస్తున్నా.. నేటికీ కార్యరూపం దాల్చలేదు. కనీసం హైలెవల్ కాజువే నిర్మించినా.. గ్రామానికి కొంతవరకు సమస్య తీరేది. నిధులు మంజూరైన నేపథ్యంలో ఈసారైనా నిర్మాణం పూర్తి చేయాలని వారు కోరుతున్నారు.



కాజువేపై నుంచి ప్రవహిస్తున్న నీరు

జీఓ 115 రద్దు చేయాలని నర్సుల నిరసన

ఆరిలోవ, సెప్టెంబరు 12 : జీఓ నెంబరు 115ను ప్రభుత్వం తక్షణమే రద్దు చేయాలని విమ్స్ ఆస్పత్రిలో పని చేస్తున్న కాంట్రాక్ట్ నర్సులు డిమాండ్ చేశారు. గురువారం వారు ఆస్పత్రి గేటు వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆస్పత్రిలో కొన్నేళ్లుగా విధులు నిర్వహిస్తున్న 214 మందిని రెగ్యులర్ చేయాలన్నారు. అలాగే 115 జీఓను రద్దు చేయాలన్నారు. అనంతరం విమ్స్ డైరెక్టర్ రాంబాబుకు వినతిపత్రం అందించారు.కార్యక్రమంలో సిబ్బంది జయరాజు, మోనిక, భారతి, భరత్, కిశోర్, వెంకట దుర్గ పాల్గొన్నారు.



ఆస్పత్రి గేటు వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న నర్సులు

సాధ్యమైనంత త్వరగా రోడ్ల నిర్మాణం

సిరిపురం, సెప్టెంబరు 12 : నగరంలో రోడ్ల నిర్మాణానికి సాధ్యమైనంత త్వరగా ప్రతిపాదనలు తయారు చేయాలని వీఎంఆర్డీఏ కమిషనర్ విశ్వనాథన్ సంబంధిత అధికారులకు సూచించారు. గురువారం ఆయన నాతయ్యపాలెం నుంచి చుక్కవానిపాలెం వరకు వీఎంఆర్డీఏ ప్రతిపాదిత 100 అడుగుల రోడ్లను, లాలెన్‌ఫ్రెషా ఫార్మాసిటీ నుంచి అచ్యుతాపురం 200 అడుగుల రోడ్లను పరిశీలించారు. అచ్యుతాపురం సెజ్ పరిధిలో విస్తరించాల్సిన రహదారులను కూడా పరిశీలించారు. ఆయనతో పాటు చీఫ్ ఇంజనీర్ భవానీ శంకర్, చీఫ్ అర్బన్ ప్లానర్ సంజయ్‌రత్నకుమార్, తదితరులు ఉన్నారు.



రోడ్ల వివరాలు తెలుసుకుంటున్న వీఎంఆర్డీఏ కమిషనర్ విశ్వనాథన్

బ్లీచింగ్, సున్నం వితరణ

భీమునిపట్నం, సెప్టెంబరు 12 : మండలంలోని గ్రామాల్లో పారిశుధ్యం మెరుగు కోసం దివీస్ కంపెనీ రూ. 4.20 లక్షల విలువైన బ్లీచింగ్ పౌడర్, సున్నం ప్యాకెట్‌లను వితరణగా అందజేసింది. గురువారం ఆ కంపెనీ సీఎస్ఆర్ అధికారి సురేష్ కుమార్ ఆధ్వర్యంలో రెండు లారీల్లో 270 బస్తాల బ్లీచింగ్, మరో 270 బస్తాల సున్నం బస్తాలను ఈఓపీఆర్‌డీకి అప్పలరాజుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, దివీస్ కంపెనీ ప్రతినిధులు శ్రీనివాస్, నరసింహారావు, తదితరులు పాల్గొన్నారు.

బీసీజీ వ్యాక్సిన్‌తో క్షయ నివారణ

మధురవాడ, సెప్టెంబరు 12 : క్షయ నివారణకు బీసీజీ వ్యాక్సిన్ వేయించుకోవాలని వైద్యాధికారి ప్రశాంతి సూచించారు. గురువారం మధురవాడ పీహెచ్‌సీ సిబ్బంది పలుచోట్ల నిర్వహించిన బీసీజీ వ్యాక్సినేషన్‌ను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 18 ఏళ్లు దాటి పొగ తాగే అలవాటున్న వారు, షుగర్ వ్యాధిగ్రస్తులు, గత ఐదేళ్లలో టీబీకి గురై కోలుకున్న వారు బీసీజీ వ్యాక్సిన్ వేయించుకుంటే భవిష్యత్తులో వ్యాధి బారిన పడకుండా ఉంటారని చెప్పారు.

సీతారాం ఏచూరి మృతి పట్ల మాజీ ఎమ్మెల్యే ముత్తంశెట్టి సంతాపం

భీమునిపట్నం, సెప్టెంబరు 12 : సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి, రాజ్యసభ మాజీ ఎంపీ సీతారాం ఏచూరి మృతి పట్ల మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో సంతాపం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా పోరాట యోధులకు మరణం ఉండదని, జన హృదయాల్లో ఆయన చిరస్థాయిగా నిలిచి ఉంటారని చెప్పారు.

వరద బాధితులకు రూ. 2 లక్షల విరాళం

భీమునిపట్నం, సెప్టెంబరు 12 : పట్టణంలోని బ్రాహ్మణ వీధికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు ఎంవీఎల్ కామేశ్వరరావు విజయవాడ వరద బాధితుల సహాయార్థం రూ. 2 లక్షల విరాళం ప్రకటించారు. ఈ మొత్తాన్ని ఆయన ముఖ్యమంత్రి సహాయ నిధికి పంపించామన్నారు. ఈమేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. గతంలో కరోనా సమయంలోనూ ఆయన ప్రధాన మంత్రి సహాయ నిధికి రూ.లక్ష విరాళం అందించారు.

డిడాక్ ఇండియా సదస్సుకు రామునాయుడు

సిరిపురం, సెప్టెంబరు 12 : న్యూఢిల్లీలోని యశోభూమిలో ఈనెల 18 నుంచి 20 వరకు విద్యా సంస్కరణలకు సంబంధించి జరిగే డిడాక్ ఇండియా సదస్సుకు నగరానికి చెందిన స్కూల్ ఆఫ్ వండర్ కిడ్స్ డైరెక్టర్ మళ్ల రామునాయుడుకు ఆహ్వానం అందింది. ఈమేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.

వ్యాధుల పట్ల అప్రమత్తం : ఎంపీడీవో

పద్మనాభం (రూరల్), సెప్టెంబరు 12 : గ్రామాల్లో వ్యాధులు విజృంభించకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో విజయ్‌కుమార్ సూచించారు. గురువారం ఆయన పాండ్రంగి, మునివానిపాలెం, సామయ్యవలస, కురపల్లిలో పారిశుధ్యం పనులను పరిశీలించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ గోస్తనీ పరివాహక ప్రాంతానికి ఆనుకుని ఉన్న గ్రామాల్లో తాగునీరు కలుషితం కాకుండా చర్యలు చేపడుతున్నామన్నారు.

బీఆర్‌టీఎస్ రోడ్డులో కారు, పోలీసు వాహనం ఢీ

ఆరిలోవ, సెప్టెంబరు 12 : బీఆర్‌టీఎస్ రోడ్డులోని సంజయ్‌గాంధీ కాలనీ సాయి మందిరం సమీపంలో గురువారం పోలీసు వాహనం, కారు ఢీకొన్నాయి.ఈ ప్రమాదంలో ఎవరికి ఎటువంటి గాయాలు కాకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. హనుమంతవాక జంక్షన్ నుంచి బీఆర్‌టీఎస్ రోడ్డులో వస్తున్న పోలీసు జీపు పెదగదిలి వైపు నుంచి నగరంలోకి వెళ్తున్న కారుని బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో జీపు డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. కాగా బీఆర్‌టీఎస్ రోడ్డులో ఎమెర్జెన్సీ వాహనాలు, అంబులెన్స్‌లు, ఆర్‌టీసీ సిటీ బస్సులు మాత్రమే వెళ్లాలి. కాని ఇతర వాహనాలు కూడా రావడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు ఈ విషయమై దృష్టిసారించాలని పలువురు కోరుతున్నారు.

భీమిలి-విజయనగరం బస్సును పునరుద్ధరించాలని వినతి

భీమునిపట్నం, సెప్టెంబరు 12 : భీమిలి నుంచి విజయనగరం పట్టణానికి సిటీ బస్సు సౌకర్యాన్ని పునరుద్ధరించాలని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావును ఫోరం ఫర్ బెటర్ భీమిలి అధ్యక్షుడు రాజేటి బసవ కృష్ణమూర్తి కోరారు. గురువారం ఆయన ఎమ్మెల్యేను ఆయన క్యాంపు కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందించారు.ఈ సందర్భంగా కృష్ణమూర్తి మాట్లాడుతూ భీమిలి-అనకాపల్లి, భీమిలి-సింహాచలం రూట్‌లో గతంలో బస్సులు నడిచేవని చెప్పారు. పర్యాటకంగా, వాణిజ్యపరంగా అభివృద్ధి చెందుతున్న భీమిలికి విజయనగరం, సింహాచలం మధ్య సర్వీసులను పునరుద్ధరించాలన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మధురవాడ, సెప్టెంబరు 12 : నగరంపాలెం ఫీడర్ నిర్వహణ పనుల దృష్ట్యా శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు జోన్-3 డీఈ పోలాకి శ్రీనివాసరావు తెలిపారు. గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. గణేష్‌నగర్, పోర్టు కాలనీ, కళానగర్, బొట్టవానిపాలెం, స్వతంత్రనగర్‌కాలనీ, డాక్‌యార్డు కాలనీ, వాంబే కాలనీ, శ్రీనివాస నగర్, నగరంపాలెం ప్రాంతాలకు సరఫరా ఉండదని చెప్పారు.

కొమ్మాది : కొమ్మాది సబ్ స్టేషన్ పరదేశిపాలెం 11 కేవీ ఫీడర్, మారికవలస 11 కేవీ జె.కె. ఫీడర్ నిర్వహణ పనుల దృష్ట్యా శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 వరకు విద్యుత్ ఉండదని ఏఈ తెలిపారు. పరదేశిపాలెం, ఈడబ్ల్యూఎస్ కాలనీ, కొత్త పరదేశిపాలెం, పాత పరదేశిపాలెం, డంపింగ్‌యార్డు, ఇండస్ట్రీస్ చిలుకూరి లేఅవుట్ ప్రాంతాలకు సరఫరా ఉండదని చెప్పారు.

డిగ్రీ కళాశాలలో ప్రవేశాలకు మూడో విడత షెడ్యూల్ విడుదల

భీమునిపట్నం, సెప్టెంబరు 12 : పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రవేశాలకు మూడో విడత షెడ్యూల్‌ను ప్రభుత్వం ప్రకటించిందని కళాశాల ప్రిన్సిపాల్ విష్ణుమూర్తి తెలిపారు. గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఆసక్తి గల విద్యార్థులు ఈనెల 15వ తేదీలోగా ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని చెప్పారు. ఈనెల 11 నుంచి 16 వరకూ దరఖాస్తు చేసుకున్న వారి ధ్రువీకరణ పత్రాలను పరిశీలిస్తామన్నారు. 18 వరకు వెబ్ ఆప్షన్స్ పెట్టుకోవచ్చన్నారు. వెబ్ ఆప్షన్స్ మార్పునకు 19 వరకు అవకాశం ఉంటుందన్నారు. 22న కళాశాలల అలాట్‌మెంట్, 22 నుంచి 25 వరకు చేరికలు జరుగుతాయని తెలిపారు.

ఎర్రమట్టి దిబ్బల ప్రాంతంలో భూమి కేటాయింపుపై విచారణ

విశాఖపట్నం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : భీమిలి ఎర్రమట్టి దిబ్బల ప్రాంతంలో వందల ఎకరాల భూమిని సొసైటీకి కేటాయించడంపై ఫిర్యాదు అందడంతో ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. ఇక్కడ కొన్ని దశాబ్దాల క్రితం భీమిలి మ్యూచువల్ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ బిల్డింగ్ సొసైటీకి ప్రభుత్వం సర్వే నంబరు 118/5ఏలో 250 ఎకరాల భూమిని కేటాయించింది. ఆ సొసైటీ అనుమతులు లేకపోవడం వల్ల ఇంతవరకు దానిని లేఅవుట్ వేసి ప్లాట్లుగా విభజించి సభ్యులకు కేటాయించలేకపోయింది. దానిని ఆనుకొని ఉన్న ప్రాంతాన్ని ప్రభుత్వం వారసత్వ సంపదగా గుర్తించి, దానిని పరిరక్షించాలని ఆదేశించింది. ఇటీవల ఏ అనుమతులు లేకుండానే సొసైటీ సభ్యులు ఎర్రమట్టి దిబ్బలను తవ్వేసి చదును చేయడం వివాదాస్పదంగా మారింది. దీనిపై జనసేన నాయకుడు పీతల మూర్తియాదవ్ ఫిర్యాదు చేయడంతో తవ్వకాలను అధికారులు ఆపేశారు. అయితే ఆ ప్రాంతం అంతా వారసత్వ సంపద అని, దానిని కాపాడాలని, ఎవరికీ నిర్మాణాలకు అనుమతి ఇవ్వకూడదని యాదవ్ ప్రభుత్వానికి ఫిర్యాదు చేశారు. దాంతో ప్రభుత్వం ఆ భూమి కేటాయింపుపై విచారణ చేయాలని జిల్లా అధికారులను గురువారం ఆదేశించింది. కలెక్టర్ నివేదిక ఆధారంగా ప్రభుత్వం తదుపరి చర్యలు తీసుకోనుంది.

మజ్జిపేటలో పౌష్టికాహారంపై అవగాహన ర్యాలీ

భీమునిపట్నం (రూరల్), సెప్టెంబరు 12 : మజ్జిపేటలో మేజిక్‌బస్ సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులు పౌష్టికాహారంపై గురువారం ర్యాలీ నిర్వహించారు. పౌష్టికాహారం దినోత్సవం సందర్భంగా ఈ ర్యాలీ చేపట్టినట్టు ఆ సంస్థ సమన్వయ అధికారి రమేష్ తెలిపారు.

సిరిపురం : సంపూర్ణ ఆరోగ్యానికి సమతుల్య, పోషకమైన ఆహారం చాలా ముఖ్యమని జాతీయ పోషకాహార ప్రాంతీయ డైరెక్టర్ రితికా సమద్దర్ అన్నారు. పోషకార మాసోత్సవాల సందర్భంగా సిరిపురంలోని ఓ హాల్‌లో ఆహారం ఆరోగ్యం అన్న అంశంపై జరిగిన సదస్సులో ఆయన మాట్లాడారు.

నేటి నుంచి తిరు పవిత్రోత్సవాలు

సింహాచలం, సెప్టెంబరు 12 : వరాహలక్ష్మీనృసింహ స్వామి ఆలయంలో జరిగే నిత్య, వార, పక్ష, మాస, వార్షిక ఉత్సవాల్లో వైదిక సిబ్బంది లేదా అధికారులు తెలిసో తెలియకో చేసే దోషాల నివృత్తికి శుక్రవారం నుంచి తిరు పవిత్రోత్సవాలు నిర్వహించనున్నట్టు ఆలయ స్థానాచార్యులు రాజగోపాల్ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఏడాది పొడవునా జరిగిన పలు ఉత్సవాల్లో మంత్రం, క్రియ, ద్రవ్యం, భక్తి, శ్రద్ధ విధానాల్లో జరిగిన దోషాల నివృత్తికి ఏటా భాద్రపద మాస శుక్లపక్ష దశమి నుంచి ఐదు రోజులు తిరుపవిత్రోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. ఈమేరకు దశమి రోజున అంకురార్పణతో ఉత్సవాలకు శ్రీకారం చుట్టి, పవిత్రాధివాసం, పవిత్ర సమర్పణ, పవిత్ర విసర్జన, ఏకాంత స్నపన తిరుమంజాలను నిర్వహిస్తామన్నారు. ప్రత్యేక హోమాలను ఉభయ సంధ్యలను, చతుర్వేద, ఇతిహాస, పురాణాల పారాయణలు నిర్వహించి త్రయోదశి రోజున మహా పూర్ణాహుతి జరుపుతామన్నారు. కాగా ఉత్సవాలను పురస్కరించుకుని ఈనెల 14 నుంచి 17 వరకు స్వామివారి ఆర్జిత సేవలు రద్దు చేశారు. రాత్రి 7 గంటల వరకే భక్తులకు దర్శనాలు లభిస్తాయి.

ఓపెన్ స్కూల్లో ప్రవేశాలకు 15 వరకు గడువు

ఆరిలోవ, సెప్టెంబరు 12 : ఓపెన్ స్కూల్ టెన్త్, ఇంటర్ ప్రవేశాలకు అర్హులైన వారు ఈనెల 15వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని డీఈఓ ఎల్. చంద్రకళ తెలిపారు. గురువారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. రూ. 200 అపరాధ రుసుముతో ఈనెల 25 వరకు దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. టెన్త్‌లో ప్రవేశానికి 14 ఏళ్లు నిండిన వారు, ఇంటర్ ప్రవేశానికి టెన్త్ ఉత్తీర్ణులైన వారు అర్హులన్నారు.

6న జిల్లాస్థాయి బాడీ లిఫ్టింగ్ పోటీలు

సిరిపురం, సెప్టెంబరు 12 : సెంట్రల్ పార్కులోని డైలీ జంక్షన్ హాల్‌లో వాయుపుత్ర హెల్త్ క్లబ్ ఆధ్వర్యంలో ఈనెల 6న జిల్లాస్థాయి బాడీ లిఫ్టింగ్ పోటీలు నిర్వహించనున్నట్టు జిల్లా బాడీ లిఫ్టింగ్ సంఘం అధ్యక్షుడు సీహెచ్ మధు తెలిపారు. గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. 50 నుంచి 80 కిలోలు పైబడిన ఎనిమిది గ్రూపుల్లో ఈ పోటీలు జరుగుతాయన్నారు. వివరాలకు 88852 03519 నంబరును సంప్రతించాలని ఆయన సూచించారు.